PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 260 | విజయవాడ, ఆదివారం 23 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00
Vol No Vijayawada, Sunday 23 April 2023 Rs

షార్ నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి55 రాకెట్

'పిఎస్ఎల్వి-సి55' విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట, అమరావతి బ్యూరో

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన తిరుపతి జిల్లా షార్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి)-సి 55 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్లోని మొదటి ప్రయోగ వేదిక నుండి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు ఈ రాకెట్ ద్వారా సింగపూర్ ప్రభుత్వానికి చెందిన 741 కిలోల బరువైన టెల్ ఇయోస్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి ఇస్రో పంపింది. ఎస్టి ఇంజనీరింగ్ భాగస్వామ్యంతో దీన్ని అభివృద్ధి చేశారు. దీనితోపాటు 16 కిలోల లుమాలైట్-4 ఉపగ్రహాన్నీ అనుకున్న సమయానికి నిర్ధిష్ట కక్ష్యలోకి చేర్చింది. ఈ ఉపగ్రహాన్ని ఇన్స్టిట్యూట్ ఫర్ ఇన్ఫోకామ్ రీసెర్చ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్లోని శాటిలైట్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్ అభివృద్ధి చేశాయి. ఈ ఘన విజయం సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ మీడియాతో మాట్లాడుతూ ఇది ఇస్రో శాస్త్రవేత్తల, ఉద్యోగుల కృషి ఫలితమన్నారు. కొంచెం క్లిష్టమైన ఈ ప్రయోగంలో ఉపగ్రహాలతోపాటు ఏడు పేలోడ్స్ని కూడా పంపామని తెలిపారు. ఈసారి ప్రయోగించిన రాకెట్లో కొన్ని మార్పులు చేయడం వల్ల వ్యయం తగ్గిందని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో విదేశాల నుండి భారీ డిమాండ్ వస్తుందని తెలిపారు. దేశీయ నావిగేషన్ సేవలు త్వరలోనే అందుబాటులో ఉంటాయన్నారు. పునర్ వినియోగ రాకెట్లపై ప్రయోగాలు జరుగుతున్నా యని తెలిపారు. చిన్న ఉపగ్రహాల ప్రయోగానికి కులశేఖరపట్నంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, రెండేళ్లలో పనులు పూర్తవుతాయన్నారు.

గవర్నరు, సిఎం అభినందనలు

ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నరు జస్టిస్ ఎస్.అబ్దుల్నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అభినందనలు తెలిపారు. ఇస్రో టీమ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

లెనిన్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద దోపిడీని ఎదుర్కోవాలి

- జయంతి సభలో వక్తలు

లోపలి పేజీలో..

వాటర్గ్రిడ్ ఇక లేనట్టే!

అంత ఖర్చు భరించలేక వదిలేసిన ప్రభుత్వం

- రిజర్వాయర్ల నుండి నీటి తరలింపు, లైన్ల నిర్వహణ భారమే
- వాటర్ గ్రిడ్ అంచనా రూ.46 వేలకోట్లు
- రూ.5000 కోట్లతో ప్రస్తుతం ఎక్కడికక్కడ చిన్న ప్రాజెక్టులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన వాటర్ గ్రిడ్ ఇక లేనట్టే. రిజర్వాయర్ల నుండి ప్రజలకు నీటిని అందించాలనే ఉద్దేశంతో 2019లో ప్రకటించిన ఈ పథకాన్ని నిధులు లేవనే పేరుతో పక్కనబెట్టేశారు. దీనికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు నాబార్డు కూడా విముఖత చూపడంతో ప్రభుత్వానికి నిధులొచ్చే మార్గం కనిపించలేదు. పైస్థాయిలో అతికొద్దిమంది అధికారులకు మాత్రమే ఈ విషయంపై స్పష్టత ఉంది. అయితే ఇంకా ఈ ప్రాజెక్టు వస్తుంది, స్వచ్ఛమైన నీరు అందుతుందనే ఆలోచనతో రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం బయటకొచ్చింది. వాటర్గ్రిడ్ను పక్కనబెట్టేసిన ప్రభుత్వం దానిస్థానంలో ఎక్కడికక్కడ చిన్న చిన్న పథకాలను ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రభుత్వం డబ్బులు లేక పక్కన బెట్టేసిన అతిపెద్ద ప్రాజెక్టు ఇదే కావడం మరో విశేషం.

రాష్ట్ర ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం (వాటర్ సస్టెయినబిలిటీ) అందించాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ చేపట్టామని 2019 అక్టోబరు 11న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డి, బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఇది 2022 అక్టోబర్నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పోలవరం, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రధాన ప్రాజెక్టుల నుండి తాగునీటిని అన్ని ప్రాంతాలకూ ముఖ్యంగా సమస్య ఉన్న ఏరియాలకు పైపులైన్ల ద్వారా తరలించాలనేది ఈ గ్రిడ్ ప్రధాన ఉద్దేశం. అలాగే 30 ఏళ్లపాటు 46,982 గ్రామీణ నివాస ప్రాంతాలకు, 99 పట్టణ ప్రాంతాలకు రెండు దశల్లో తాగునీటిని అందించాలనేది ప్రధాన లక్ష్యం. మొదటిదశలో రూ.37,475 కోట్లు, రెండోదశలో రూ.9,200 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

రూ.5000 కోట్లకు పనుల కుదింపు

గతేడాది శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, కర్నూలు జిల్లా డోన్, కడప జిల్లా పులివెందుల, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ వాటర్గ్రిడ్ ప్రాజెక్టుకు సిఎం శంకుస్థాపన చేశారు. ఇప్పుడు వాటర్గ్రిడ్ను పక్కనపెట్టి విడివిడిగా చిన్న ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో ఉద్దానం, డోన్, పులివెందులలో మాత్రమే పనులు జరుగుతున్నాయి. ఇవి కాకుండా పల్నాడు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, సత్యసాయి జిల్లాల్లో టెండర్లు ఇచ్చారు. వీటిల్లో ఒక్కో ప్రాజెక్టు విలువ సుమారుగా రూ.1000 కోట్ల నుండి రూ.1200 కోట్ల వరకూ ఉంటుంది. కొన్ని తక్కువగానూ ఉన్నాయి. మొత్తంగా రూ.5000 కోట్లతో ప్రాజెక్టును ముగించేయాలని నిర్ణయించారు.

వెనక్కు తగ్గిన నాబార్డు

వాటర్గ్రిడ్ ప్రాజెక్టుకు నిధులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నాబార్డును కోరగా తొలుత అంగీకరించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.630 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం రూ.1200 కోట్లు నిధులిచ్చింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం వేరే అవసరాలకు వాడుకుంది. దీనిపై నాబార్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో వాటర్గ్రిడ్కు నిధులు ఇచ్చే అంశంపై విముఖత వ్యక్తం చేసింది. ఎడిబి నుండి కూడా రావాల్సిన నిధులు రాకపోవడంతో ఇక ప్రాజెక్టు చేపట్టడం కష్టమనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం.

సర్వేల పేరుతో కాలయాపన

ప్రస్తుతం పనులు కేటాయించిన ఆరుచోట్ల కూడా పనులు మొదలవలేదు. ముందు టెండర్లు స్వీకరించినా ప్రభుత్వం నుండి నిధులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఆలోచనలో పడ్డారు. దీంతో గ్రౌండ్ రియాలిటీ, ఫిజుబిలిటీ, నేలస్వభావం, టెక్నికల్ అంచనాల పేరుతో రకరకాల రిపోర్టులు తీసుకోవాలంటూ కాలయాపన చేస్తున్నారు. అవి మొదలవుతాయో లేదో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోతోందని, అటువంటప్పుడు పనులు చేస్తే నష్టపోతామన్న భావన కాంట్రాక్టర్లలో నెలకొంది. రెండు పెద్ద సంస్థలు మాత్రం ఉన్నంతలో మెల్లిగా పనులు సాగదీస్తున్నాయి.

పాఠ్య పుస్తకాలను స్వతంత్రంగా ముద్రిస్తాం

- ఎన్సిఇఆర్టి తొలగించిన పాఠాలు తిరిగి చేరుస్తాం
- కేరళ మంత్రి వి శివన్కుట్టి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సిఇఆర్టి) తొలగించిన పాఠ్యాంశాలను బోధించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే తామే స్వతంత్రంగా పుస్తకాలను ముద్రిస్తామని కేరళ విద్యా శాఖ మంత్రి వి శివన్కుట్టి అన్నారు. కేరళ ఎల్లప్పుడూ లౌకిక, రాజ్యాంగ విలువలను కాపాడుతుం దన్నారు. పాఠశాలల్లో ఎన్సిఇఆర్టి తొలగించిన పాఠ్యాంశాలను బోధించాలని తాము గట్టిగా కోరుతున్నామన్నారు. పాఠశాల పాఠ్యపుస్తకాల నుండి కొన్ని భాగాలను మినహాయించాలనే ఎన్సిఇఆర్టి నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కొచ్చిలో జరిగిన సమావేశంలో శివన్కుట్టి ప్రసంగించారు. మొఘల్ శకం, గుజరాత్ మత ఘర్షణలు వంటి పాఠ్యాంశాలను చరిత్ర పుస్తకాల నుండి తొలగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు.

'కేరళ ఎప్పుడూ లౌకిక, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుంది. తొలగించిన పాఠాలన్నీ దేశ చరిత్రలో చాలా ముఖ్యమైన ఘట్టాలు. అందువల్ల ఆ పాఠాలన్నీ బోధించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ విధంగా పాఠాలు తొలగించడం ద్వారా చరిత్రను వక్రీకరించలేరు. ఈ విషయాన్ని కేంద్రంలోని బిజెపి పాలకులకు ఎలా నేర్పాలో పరిశీలిస్తున్నాం. కేరళ స్వతంత్రంగా పాఠ్యపుస్తకాలను ముద్రించగలదు' అని శివన్ కుట్టి తెలిపారు. ఎన్సిఇఆర్టి నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రమే పాఠ్యపుస్తకాలను ముద్రించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కేంద్రం తన ఆలోచనలను ఇలా రాష్ట్రాలపై రుద్దడానికి వీల్లేదన్నారు. రాష్ట్రాలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించడంతో ఎన్సిఇఆర్టి బోర్డును పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఎన్సిఇఆర్టి పాఠ్యాంశాల తొలగింపును విమర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే.

ఆగస్టులో ఐలు రాష్ట్ర మహాసభ

లోపలి పేజీలో..

ఢిల్లీ పోలీసుల అదుపులో సత్యపాల్ మాలిక్ !

- 25 మంది రైతు సంఘాల నేతలు కూడా
- మాలిక్ మద్దతుదారుల ఆందోళన

లోపలి పేజీలో..

ఎప్పటి బీమా అప్పుడు... డౌటే!

- కేంద్ర పథకంలో చేరడంతో రంగంలోకి ప్రైవేటు కంపెనీలు
- రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం
- ఆనక పలు కొర్రీలు

Pradhanmantri Fasal Bima Yojana

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తుల వలన ఏ సీజన్లో పంటలు నష్టపోతే ఆ సీజన్లోనే రైతులకు బీమా చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరేలా కనిపించట్లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం సొంతంగా ఇన్సూరెన్స్ను నిర్వహించగా, ఈ ఏడాది నుంచి కేంద్ర పథకం ఫసల్ బీమా స్కీంలో చేరడంతో ఎప్పటి పరిహారం అప్పుడేనన్న వాగ్దానం అమలు అసాధ్యంగా పరిణమించింది. పంటల బీమాలో తిరిగి ప్రైవేటు కంపెనీలకు ఆస్కారం కల్పించడం వలన బీమా క్లెయిముల పరిష్కారం ఒక పట్టాన తేలేలా లేవు. రైతులకు చెల్లింపులు బాగా ఆలస్యం కానున్నాయి. వైసిపి అధికారంలోకొచ్చాక రైతుల కోసం 'వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2019-20 రబీ నుంచి 2021-22 వరకు ఖరీఫ్, రబీలో ఉచిత బీమా అమలు చేసింది. గతంలో రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. ప్రీమియంలో తతిమ్మా భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించేవి. ఉచిత పంటల బీమా అనడంతో రైతులు అస్సలు చెల్లించవలసినపనిలేదు. కేంద్ర పథకాలతో తెగతెంపులు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో బీమా పథకాలను అమలు చేసింది. దాంతో ఇన్నేళ్లల్లో కేంద్రం తన వాటా ప్రీమియం నిధులను రాష్ట్రానికి ఇవ్వలేదు.

మళ్లీ కంపెనీలు

కొన్నేళ్లుగా కేంద్రం నుంచి నిధులు రానందువలన, తమ పథకాల్లో చేరమని కేంద్రం చేసిన ఒత్తిడి ఫలితంగా, తిరిగి రాష్ట్ర సర్కారు కేంద్ర బీమా పథకాల్లో చేరింది. 2022-23 ఖరీఫ్, రబీలో దిగుబడి ఆధారంగా ఫసల్బీమా, వాతావరణ డేటా ఆధారంగా వాతావరణ బీమా పథకాల్లో వాతావరణ బీమా అమలుకు తిరిగి రాష్ట్ర సర్కారే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఫసల్బీమాకు మాత్రం బిడ్ల ద్వారా తొమ్మిది క్లస్టర్లకు కంపెనీలను ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎఐసితో పాటు రిలయన్స్ జిఐసి, హెచ్డిఎఫ్సి ఎర్గో, ఇఫ్కో టోకియో, ఎస్బిఐ జిఐసి మిగతా 2లో

ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రవ్వా శ్రీహరి కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సుప్రసిద్ధ సాహితీవేత్త, తెలుగు సంస్కృత భాషా పండితులు ఆచార్య డాక్టర్ రవ్వా శ్రీహరి (80) శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్లో కన్ను మూశారు. వయోభారంతో పాటు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. నల్గొండ జిల్లా వెల్వర్తికి చెందిన శ్రీహరి చేనేత కుటుంబంలో పుట్టారు. ఆంధ్ర సారస్వత పరిషత్లో అధ్యాపకుడిగా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం తెలుగు హెచ్ఒడిగా, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షు నిగా, టిటిడి ప్రచురణల విభాగం ఇన్ఛార్జి ఎడిటర్గా పనిచేశారు. తెలుగు భాషలో 50కిపైగా గ్రంథాలను, సంస్కృతంలో 25 పుస్తకాలను రచించారు.

జగన్, కెసిఆర్ సంతాపం

శ్రీహరి మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

స్టీల్ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

3న రాస్తారోకోకు వామపక్షాల మద్దతు

వైసిపి ప్రజల పక్షమా? మోడీ పక్షమా? తేల్చాలన్న లెఫ్ట్ నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకుంటే ఆంధ్రుల ఆగ్రహానికి గురికాక తప్పదని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి సంఘీభావంగా మే 3న కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త రాస్తారోకో కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సంఘీభావం ప్రకటిస్తామన్నారు. విజయవాడలోని దాసరి భవన్లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణతోపాటు ఇతర వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరించవద్దని 800 రోజులుగా కార్మికులు ఉద్యమం చేస్తుంటే ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్రం ముందుకెళ్లే ప్రయత్నం చేయడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తే విశాఖ ఉక్కు సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని రాష్ట్రప్రభుత్వం చెప్పడం సంతోషకరమైనప్పటికీ ఎప్పుడో వచ్చే పెట్టుబడులు కంటే ఉన్నదాన్ని అమ్ముకోవడం ఎంతవరకూ సబబని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని అన్నారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షమా? మోడీ పక్షమా? తేల్చుకోవాలని అన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవటం కోసం సెయిల్ బిడ్లో పాల్గొనేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. బిడ్లో పాల్గొంటామన్న సింగరేణిపై 49 శాతం వాటాలున్నాయనే పేరుతో కేంద్రం అడ్డుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఒకవైపు బిడ్లో పాల్గొనీయకుండా ఒత్తిడి చేసిన బిజెపి నాయకులే మరలా విమర్శలు చేస్తున్నారని తెలిపారు. మూడు లక్షల కోట్ల విలువైన ఆస్తి, 40 వేలమందికి ఉపాధి కల్పించే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, సిఎం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. అలా అయితేనే స్టీల్ప్లాంటు ప్రైవేటీకరణ ఆగుతుందని, ఆపాలని సిఎం కూడా మిగతా 2లో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో కె రామకృష్ణ, వామపక్ష పార్టీల నాయకులు

ఘనంగా రంజాన్ వేడుకలు

రంజాన్ వేడుకలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. కర్నూలులోని కొత్త బస్టాండు సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థన నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఇసెట్, ఎడ్సెట్ పరీక్షల తేదీలు మార్పు

- ఎడ్సెట్కు ఓరియెంటల్ అభ్యర్థులు అర్హులే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసెట్, ఎడ్సెట్ పరీక్షల తేదీలను ఎపి ఉన్నత విద్యామండలి మార్చింది. ముందుగా ప్రకటించిన తేదీలను కాకుండా కొత్త తేదీలను ప్రకటించింది. బిఇ, బిటెక్, బిఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఇసెట్)ను మే 5న ఉన్నత విద్యామండలి ఆధ్వర్యాన జరగాల్సి ఉంది. జూన్ 20న ఈ పరీక్ష నిర్వహిస్తామని ఇసెట్ కన్వీనరు ఎ కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పరీక్షలు ఇంకా పూర్తికాలేదని పేర్కొన్నారు. సాంకేతిక విద్య కమిషనర్, సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు అభ్యర్థన మేరకు ఈ పరీక్షను వాయిదా వేస్తున్నామని వెల్లడించారు. పూర్తి వివరాలను cets.apsche.ap.gov.in/ECET ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎటువంటి సందేహాలున్నా 8500404562 హెల్ప్లైన్ నెంబరును సంప్రదించాలన్నారు. మే 20న నిర్వహించాల్సిన ఎడ్సెట్ పరీక్షను జూన్ మూడో వారంలో నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి వై నజీర్ మరో ప్రకటనలో తెలిపారు. బిఎ ఓరియెంటల్ కోర్సు చేసిన అభ్యర్థులూ ఎడ్సెట్కు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సోషల్ మెథడాలజీ విభాగంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత గల అభ్యర్థులు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు.

ఆర్ -5 జోన్లో జంగిల్ క్లియరెన్స్ను అడ్డుకున్న రైతులు

- 24న రాజధాని గ్రామాల్లో ప్రజాచైతన్య పాదయాత్ర

లోపలి పేజీలో..

సెప్టెంబరులో బైడెన్ భారత్ పర్యటన ?

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సెప్టెంబరులో భారత్లో పర్యటించాలనుకుంటున్నారని ఆయన సహాయకులు, దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ఇన్చార్జి డొనాల్డ్ లూ తెలిపారు. భారత్-అమెరికా సంబంధాల్లో 2024 కీలక సంవత్సరం కాబోతుందని ఆయన వ్యాఖ్యానించారు. జి-20కి భారత్ నాయకత్వం వహించడం వల్ల ప్రపంచానికి మంచి చేసే శక్తిగా దాని సామర్థ్యాలు మరింత విస్తృతమయ్యాయని ఆయన అన్నారు. "నిజంగానే 2024 కీలక సంవత్సరం కాబోతోంది. జి-20కి భారత్ ఆతిథ్యం ఇస్తోంది.

ఇదే సంవత్సరం అపెక్కు అమెరికా ఆతిథ్యమిస్తోంది. అలాగే జి7 శిఖరాగ్ర సదస్సుకు జపాన్ ఆతిథ్యమిస్తోంది. క్వాడ్ కూటమిలోని సభ్య దేశాలే నాయకత్వ పాత్రలో ఉన్నాయి" అని డొనాల్డ్ లూ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ఏడాది మొదటి మూడు మాసాల్లో ముగ్గురు అమెరికన్ మంత్రులు భారత్లో పర్యటించారని ఆయన తెలిపారు. బైడెన్ భారత్ పర్యటన విజయవంతం అవుతుందనే తాను ఆశిస్తున్నానని డొనాల్డ్ లూ చెప్పారు.

ఆగస్టులో ఐలు రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభ ఆగస్టు 13, 14, 15న గుంటూరులో జరగనున్నాయి. ఈ మేరకు ఐలు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుంకర రాజేంద్ర ప్రసాద్, నర్రా శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సుంకర రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన శనివారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. న్యాయవాదులకు సిఐడి నోటీసులు ఇవ్వడాన్ని రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. వృత్తిపరంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, రక్షణ చట్టం తీసుకురావాలని, బార్ అసోసియేషన్‌లలో మహిళా న్యాయవాదులకు సరైన వసతులు కల్పించాలని, తదితర అంశాలను రాష్ట్ర కమిటీ తీర్మానించిందని నర్రా శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో సంపర శ్రీనివాసరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, శైలజ, కట్టా సత్యనారాయణ, గండికోట శేషగిరిరావు, గోనుగుంట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఫ్యామిలీ పెన్షన్‌తో సంబంధం లేకుండా ప్రమాద బీమా : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రమాద బీమాను లెక్కించేప్పుడు ఫ్యామిలీ పెన్షన్‌ను పరిగణనలోకి తీసుకోరాదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఫ్యామిలీ పెన్షన్ మోటారు వాహనాల చట్టం పరిధిలోకి రాదని తేల్చింది. దీనిని ఆర్థికపరమైన ప్రయోజనంగా చూడరాదని స్పష్టం చేసింది. రోడ్డు ప్రమాదంలో మరణించే వ్యక్తి వయసు, స్థూల జీతం, ఆయనపై ఆధారపడిన కుటుంబసభ్యుల మొదలైన వాటిని గమనంలోకి తీసుకోవాలంది. విశాఖపట్నానికి చెందిన తిరుపతిరావు చెన్నైలోని సైంటిఫిక్ రీసెర్చ్ కౌన్సిల్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా చేస్తుండగా, 2013లో చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ వాహనం ఢీకొంది. ఆయనతోపాటు కుమార్తె కూడా మరణించారు. ఫ్యామిలీ పెన్షన్ వస్తున్నందున రూ.21.20 లక్షల పరిహారాన్ని చెల్లించాలని విశాఖపట్నం మోటారు ప్రమాద క్లెయిమ్‌ల ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. దీనిని ధనలక్ష్మి, చరణ్ తేజా హైకోర్టులో సవాల్ చేశారు. ఆ మొత్తానికి రూ.15.87 లక్షలను కలిపి మొత్తం రూ.37.07 లక్షలు చెల్లించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది.

నీటి ప్రాజెక్టులపై కమిటీ

- కొట్టుకుపోయిన పులిచింతల ప్రాజెక్టు గేటును త్వరగా ఏర్పాటు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్



పులిచింతల ప్రాజెక్టును పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, వై.కేశవరావు, ఎం.హరిబాబు తదితరులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట

నీటి ప్రాజెక్టులపై కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టులపై అధ్యయనం చేసి షెడ్యూల్ ప్రకారం వాటిని పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులిచింతల ప్రాజెక్టును రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబుతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. వరదలకు కొట్టుకుపోయిన గేటు వివరాలు, ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ తదితర వివరాలను ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని సుందరయ్య భవన్‌లో శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు, ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు, పోలవరం ప్రాజెక్టు కాపర్ డామ్ వరదలకు కొట్టుకుపోయినా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే పూర్తి చేయలేదన్నారు. దీనిని బట్టి ప్రభుత్వానికి ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంలో, వాటిని నిర్వహించడంలో చిత్తశుద్ధిలేదని స్పష్టమవుతోందని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రస్తుత బడ్జెట్లో ప్రభుత్వం రూ.11 వేల కోట్లు కేటాయించిందని, గత ఏడాది రూ.10 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. కానీ వీటిలో రూ.6 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఈసారి బడ్జెట్లో కేటాయించిన నిధులనైనా ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లతో రాజకీయ నాయకులు కుమ్మక్కై, వాటాలు, అడ్వాన్సులు తీసుకొని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని, దీంతో అవి నాణత్య లేకపోవడంతోపాటు నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణంలో కాంట్రాక్టర్ లోపం, ప్రభుత్వ అసమర్థత స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. కొట్టుకుపోయిన గేటు పున:నిర్మాణానికి రూ.8 కోట్లు కేటాయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. కంట్రోల్ రూమ్ నిర్మాణం పునాది దశలోనే ఆగిపోయిందన్నారు. కొట్టుకుపోయిన పులిచింత గేటును ప్రభుత్వం తక్షణమే నిర్మించి వచ్చే ఖరీఫ్‌లో రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ నుండి వంద టిఎంసిల నీరు వస్తుందని, ఆ నీటితో పులిచింతల ప్రాజెక్టును రెండుసార్లు నింపవచ్చని తెలిపారు. రాయలసీమకు గోదావరి నీరు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టు 16వ గేటును తక్షణమే పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి జూన్ నాటికి నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ కృష్ణా డెల్టా శివారు భూములకూ సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

వివేకాను చంపేంత పగ ఎవరికుంది?

- ఆరు గంటలపాటు విచారణ
- సిబిఐ ముందు హాజరైన వైఎస్ అవినాష్, భాస్కర్ రెడ్డి, ఉదయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు నాలుగో రోజు శనివారం సిబిఐ విచారణకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల సమయంలో చంచల్‌గూడ జైలుకు చేరుకున్న అధికారులు ప్రత్యేక వాహనంలో వారిని కోఠిలోని సిబిఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. దాదాపు 6 గంటల పాటు ప్రశ్నించారు. హత్య జరిగిన రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై వీరిద్దరినీ ప్రశ్నించినట్లు సమాచారం. మరో రెండు రోజుల పాటు కస్టడీ గడువు ఉండటంతో మరిన్ని వివరాలు రాబట్టే అవకాశం ఉంది. మరోవైపు ఇదే కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డిని కూడా సిబిఐ అధికారులు విచారించారు. ముఖ్యంగా వివేకానందరెడ్డి, భాస్కరరెడ్డి కుటుంబాల మధ్య ఉన్న సంబంధాలపై, 2017 ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో నెలకొన్న పరిస్థితులపై సిబిఐ ఆరా తీసింది. ఈ ఎన్నికల్లో తాను ఓడిపోవడానికి భాస్కర్‌రెడ్డే కారణమని భావిస్తూ వివేకానందరెడ్డి వారిపై ఆగ్రహం వెలిబుచ్చినట్లు జరిగిన ప్రచారంపై ఉదయ్‌కుమార్‌రెడ్డిని అడిగారు. ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న స్పర్థలు, వాటికి గల కారణాలపై సిబిఐ అధికారులు ప్రశ్నించారు. అసలు వివేకాను హత్య చేయాలన్నంత పగ ఎవరికి ఉంటుందని ప్రశ్నించారు. వీటిలో చాలా వాటికి సమాధానం తెలియదనే ఉదయ్‌కుమార్‌రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. భాస్కరరెడ్డిని కూడా వీటికి సంబంధించిన అంశాలనే అడిగినట్లు, వివేకాకు, ఆయనను హత్య చేసిన వారి మధ్య ఉన్న కక్షలు, వాటికి కారణాలపై విచారించారు.

సిబిఐ విచారణకు హాజరైన వివేకా అల్లుడు రాజశేఖర్ రెడ్డి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డిని సిబిఐ అధికారులు విచారించారు. శనివారం ఉదయం సిఆర్‌పిసి 160 కింద నోటీసులు జారీ చేసిన సిబిఐ.. సాయంత్రం 4 గంటలకు కోఠిలోని సిబిఐ కార్యాలయంలో ఆయనను విచారించింది. హత్యా స్థలంలో దొరికిన లేఖపై రాజశేఖర్‌రెడ్డిని సిబిఐ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. లేఖను ఎందుకు దాచిపెట్టమని చెప్పాల్సి వచ్చిందని ప్రశ్నించినట్లు సమాచారం. సుమారు గంటల విచారణ అనంతరం ఆయన ఇంటికి వెళ్లిపోయారు. మరోవైపు ఈ కేసులో ఇటీవల అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలతోపాటు కడప ఎంపి అవినాష్‌రెడ్డిని కూడా సిబిఐ విచారిస్తున్న తరుణంలో రాజశేఖర్‌ను విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వివేకా అల్లుడిని కూడా విచారించాలని అవినాష్‌రెడ్డి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డిని సిబిఐ అధికారులు విచారించారు.

పిడుగుల వాన

- తిరుపతిలో పశువులకాపరి మృతి
- ప్రకాశంలో 19 జీవాలు మృత్యువాత

ప్రజాశక్తి-కేవీబీపురం (తిరుపతి జిల్లా)

తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో పిడుగులు పడి ఒకరు మృతి చెందారు. 19 జీవాలు మృత్యువాతపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం బ్రాహ్మణపల్లి దళితవాడకు చెందిన బొగ్గుల వెంకటేష్ (55) పశువులను మేపేందుకు శుక్రవారం గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లారు. రాత్రి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.

శనివారం ఉదయం పొలాల్లో వెంకటేష్ విగతజీవిగా పడి ఉన్నారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి మృతి చెందారని గ్రామస్తులు తెలిపారు. వెంకటేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలో శుక్రవారం రాత్రి పెనుగాలులు వీయడంతోపాటు పిడుగులు పడ్డాయి. దీంతో కర్రోల గ్రామంలోని కోనంగి పాలంకయ్యకు చెందిన 19 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. వాటి ఖరీదు సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

800వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 800 రోజులకు చేరాయి. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు, ఉక్కు ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేసేందుకు రెండేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఇఒఐ విధానాన్ని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు అప్పు ఇప్పిస్తే కార్మికులు ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్తారని అన్నారు. ఇఒఐ అవసరమే ఉండదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే నిర్వహణ ఖర్చు తగ్గి ప్లాంట్ లాభాల బాటలోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రయివేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు అప్పులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేలు కోట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉక్కు పరిరక్షణకు సాగుతున్న ఉద్యమం విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు.

ప్రైవేటు పాఠశాలలకు 8 ఏళ్ల గుర్తింపు

- విద్యాహక్కు చట్టానికి సవరణలు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు విద్యాహక్కు చట్టం-2010కు సవరణలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం జిఓ 38ను విడుదల చేశారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ పాఠశాలలకు ఇచ్చే గుర్తింపు మూడేళ్ల వరకే ఉంటుంది. ఈ గుర్తింపును మరలా పాఠశాలలు పొడిగించుకోవాల్సి ఉంటుంది. ఈ పరిమితిని ఎనిమిదేళ్ల వరకు ప్రభుత్వం పొడిగించింది. గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునే పాఠశాలల సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ గది, పాఠశాల విద్యాశాఖ కమిషనరు నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉండాలని పేర్కొంది. తాగునీటి సదుపాయంతో పాటు ఆటస్థలం ఉండాలని తెలిపింది. ప్రైవేటు పాఠశాలల కోసం కమిషనరు పోర్టల్ ఏర్పాటు చేయాలని పేర్కొంది. ప్రతియేటా పాఠశాల యాజమాన్యం తన గుర్తింపును అప్‌లోడ్ చేయాలని వెల్లడించింది.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ కోసం పర్యటనా?

- ప్రవీణ్ ప్రకాష్ తీరుపై యుటిఎఫ్ ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి.. పాఠాలు సరిగ్గా చెప్పకపోవడం, నోట్స్ దిద్దకపోవడం వంటి కారణాలతో ఉపాధ్యాయులు, అధికారులను సస్పెండ్ చేయడంపై యుటిఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ప్రకటన విడుదల చేశారు. పర్యవేక్షణ విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేయడానికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచడానికి బదులు ఇలా ఉపాధ్యాయులను శిక్షించడానికి ఉపయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల పర్యటనలో ప్రవీణ్ ప్రకాష్ హల్‌చల్ చేయడం తగదని తెలిపారు. ఈ పర్యవేక్షణ నాణ్యమైన విద్యను సాధించడానికా? ఉపాధ్యాయులను దోషులుగా చూపించడానికా? స్పష్టం చేయాలన్నారు. సస్పెన్షన్ వల్ల ఉపయోగం లేదని ప్రకటన చేసి, మరొకవైపు ఈ విధంగా సెలవు దినాల్లో సైతం ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం వల్ల విద్యా వ్యవస్థ బాగుపడకపోగా మరింత విచ్ఛిన్నతకు దారితీస్తుందనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా పర్యవేక్షణ పేరుతో సస్పెండ్ చేయడాన్ని ఆపాలని, లేకపోతే పోరాటానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు.

ఎన్‌టిఆర్ శతజయంత్యుత్సవాలకు రజినీకాంత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ శతజయంత్యుత్సవాల్లో సినీ నటులు రజినీకాంత్ పాల్గొంటారని ఉత్సవాల కమిటీ ఛైర్మన్ టిడి జనార్ధన్ వెల్లడించారు. విజయవాడలోని పోరంకిలో ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోపాటు సినీ నటులు రజినీకాంత్, బాలకృష్ణ, ఎస్ వెంకటనారాయణ హాజరవుతారని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో 'ఎన్‌టిఆర్ చారిత్రక ప్రసంగాలు', 'అసెంబ్లీ ప్రసంగాలు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు.

వేడెక్కిన రాజకీయం

- యర్రగొండపాలెం ఘటనపై మూడు కేసులు
- వైసిపి, టిడిపి పరస్పర ఆరోపణలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న వివాదం అంతకంతకూ రాజుకుంటోంది. టిడిపి, వైసిపి శ్రేణులు పరస్పరం ఆరోపణలు గుప్పించుకోవడం, కేసులు పెట్టుకోవడం, సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకోవడంతో రెండో రోజూ ఉద్రిక్తతలు కొనసాగాయి. మంత్రి ఆదిమూలపు సురేష్ విలేకరుల సమావేశం పెట్టి చంద్రబాబుకు సవాల్ విసరగా, టిడిపి నాయకులు ప్రతి సవాల్ విసిరారు.

నిలువరించే ప్రయత్నం చేశాం : మార్కాపురం డిఎస్‌పి

యర్రగొండపాలెంలో ఘటనను నిలువరించేందుకు ప్రయత్నించామని మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. యర్రగొండపాలెంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా వైసిపి కార్యకర్తలు శాంతి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో 500 మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి కార్యకర్తలకు హితబోధ చేశామన్నారు. అదే తరుణంలో యర్రగొండపాలెం నుంచి మంత్రి కార్యాలయం వైపు వస్తున్న టిడిపి కార్యకర్తలను కట్టడి చేశామని తెలిపారు. చంద్రబాబునాయుడు బోడిరెడ్డిపల్లి జంక్షన్ నుంచి మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయం దగ్గరకు రావడంతో అక్కడే వేచి ఉన్న టిడిపి కార్యకర్తలు కూడా ఆ కాన్వాయ్‌తో కలిశారన్నారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసు బలగాలతో కట్టడి చేశామని చెప్పారు. అయినా, రాళ్లు రువ్వుకున్న ఘటనలో టిడిపి, వైసిపి కార్యకర్తలకు గాయాలైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు టిడిపిపై ఒక కేసు, వైసిపిపై ఒక కేసు నమోదు చేశామని చెప్పారు. సభ నిర్వహించడానికి ఒకచోట అనుమతి తీసుకొని అక్కడ కాకుండా ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించడంతో సభ నిర్వహణకు అనుమతి తీసుకున్న వారిపైనా కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్ఎస్‌జి అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదూ అందలేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని చెప్పారు.

దాడికి కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ ఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు

వైసిపి రౌడీ మూకలను శిక్షించాలి : ఎఎస్‌పికి టిడిపి వినతి

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన వైసిపి రౌడీ మూకలను శిక్షించాలని కోరుతూ ప్రకాశం జిల్లా ఎఎస్‌పికి నాగేశ్వరరావుకు ఒంగోలులో టిడిపి ముఖ్య నేతలు శనివారం వినతిపత్రం అందజేశారు. వీరిలో టిడిపి ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, దివి శివరాం, తెలుగు యువ నాయకులు దామచర్ల సత్య ఉన్నారు.

చంద్రబాబుపై దాడికి సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడుపై వైసిపి నాయకులు రాళ్ల దాడి చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన్ను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ప్రతిపక్షనేత పర్యటనకు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. స్వయంగా కేబినెట్ మంత్రిగా ఉన్న వ్యక్తి చొక్కా విప్పి నిరసనలు తెలపడం, రెచ్చగొట్టడం వల్లే చంద్రబాబుపై దాడి జరిగిందని తెలిపారు. ఇటువంటి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల సభలకు భద్రత కల్పించడంతోపాటు సొంత పార్టీవారు రెచ్చగొట్టకుండా అదుపులో పెట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని శ్రీనివాసరావు అన్నారు.

చంద్రబాబే రెచ్చగొట్టారు

ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా : మంత్రి సురేష్

తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వేలు చూపించి, వైసిపి కార్యకర్తలను, ఎస్‌సి నాయకులను చంద్రబాబు దూషించారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. తాను భూ ఆక్రమణలకు పాల్పడ్డానని చంద్రబాబు చెప్పడాన్ని ఆయన ఆక్షేపించారు. ఒక్క సెంటు భూమి ఆక్రమించినట్లు రుజువు చేసినా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని మంత్రి సురేష్ సవాల్ విసిరారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి మా మీదకు ఉసి గొల్పడం వల్లే ఘర్షణ చోటుచేసుకుందన్నారు. కావాలనే వైసిపి కార్యాలయం వద్ద చంద్రబాబు తన కారు ఆపి రాళ్లదాడి చేయించారని ఆరోపించారు. రాళ్ల దాడిలో ముగ్గురు వైసిపి కార్యకర్తలకు గాయాలయ్యాయని తెలిపారు. దాడికి సంబంధించిన ఓ వీడియోను ఆయన మీడియా ముందు ఉంచారు. దాడి చేసిన వారిని గుర్తించామని, శుక్రవారం రాత్రే పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఐజి)కు ఫిర్యాదు చేశామని తెలిపారు. చంద్రబాబుపైనా, రాళ్లదాడికి పాల్పడిన వారిపైనా కేసులు పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు.

దళితులకు క్షమాపణ చెప్పే వరకూ చంద్రబాబును ఎక్కడికక్కడ నిలదీస్తాం : మంత్రి మేరుగ నాగార్జున

దళితులకు క్షమాపణ చెప్పే వరకూ చంద్రబాబును ఎక్కడికక్కడ నిలదీస్తామని, దళితులను భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైసిపి ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, మొండితోక అరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సోషల్ జస్టిస్) జూపూడి ప్రభాకర్ హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. యర్రగొండపాలెంలో దళితులపై చంద్రబాబు దాడి చేయించారని, దళితులే చంద్రబాబుపై దాడులు చేశారంటూ చంద్రబాబు అండ్ బ్యాచ్ ఎదురు దాడి చేస్తోందని ఆరోపించారు.

పథకం ప్రకారమే చంద్రబాబుపై రాళ్ల దాడి : అచ్చెన్నాయుడు

ఒక పథకం ప్రకారమే టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై రాళ్ల దాడి జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ దాడి స్క్రిప్ట్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఐ-ప్యాక్ రచించాయని విమర్శించారు. రూట్ మ్యాప్ తెలుసుకొని మరీ దాడి చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలది కీలకపాత్రని, వాటిని నిలువరించే ప్రయత్నం చేస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని తెలిపారు. చంద్రబాబుపై దాడి చేయించేందుకు దళితులను ముఖ్యమంత్రి జగన్ పావులుగా వాడుకున్నారని కె.అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కెఎస్ జవహర్ ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు వ్యతిరేకంగా జరిగిన దాడులు, అరాచకాలకు నిరసనగా సురేష్ చొక్కా విప్పితే దళితులు హర్షించేవారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగినా నోరు మెదపని దళిత ద్రోహి మంత్రి సురేష్ అని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు విమర్శించారు. ఎర్రగొండపాలెం ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను చట్ట ప్రకారం శిక్షించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాకు టిడిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గూడపాటి లక్ష్మీనారాయణ లేఖ రాశారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 3న రాస్తారోకోకు వామపక్షాల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటన చేయాలని కోరారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా తాము బిడ్ వేస్తామని చెప్పిన తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి తీసుకురావటంతో వెనక్కు తగ్గిందన్నారు. వైసిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్లాంటును కాపాడేందుకు కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటానికి ఇతర రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన కారణంగానే విశాఖపట్నం ఉక్కు నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. 2021-22 సంవత్సరానికి రూ.948 కోట్ల లాభాలు ఆర్జించిందన్నారు. 2022-23 సంవత్సరానికి రూ.3 వేల కోట్లు నష్టం వచ్చిందన్నారు. సంవత్సర కాలంలో ఇంత మార్పుకు గల కారణాలు కేంద్రం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గనులు కేటాయించకుండా, ముడిసరుకు కొనడానికి నిధులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా నష్టాల్లోకి నెట్టారని తెలిపారు. అదానీకి అప్పనంగా కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, ఎస్‌యుసిఐ(సి) నాయకులు కె.సుధీర్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పివి.సుందర రామరాజు మాట్లాడారు. సిపిఐ(ఎంఎల్), ఎంసిపిఐ(యూ), సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు మద్దతు ప్రకటించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

ఎప్పటి బీమా అప్పుడు... డౌటే!

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలు నోడల్ ఏజెన్సీలుగా ఎంపికయ్యాయి. పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడి గణాంకాల ఆధారంగా ఇన్సూరెన్స్ క్లెయిములు సెటిల్ చేయాలి. ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ డేటాను అంగీకరించట్లేదు. వాటికవే డేటా సేకరిస్తుండటంతో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి.

భారీ నష్టాలు

ఖరీఫ్‌లో దఫదఫాలుగా అకాల వర్షాలు, తుపాన్లు, వరదలు పంటలను నష్టపరిచాయి. డిసెంబర్‌లో వచ్చిన తుపానుకు పలు జిల్లాల్లో పంటలు నీటిపాలయ్యాయి. ఆ తర్వాత కురిసిన అకాల వర్షాలకు సైతం పలు చోట్ల పంటలకు అపార నష్టం సంభవించింది. కాగా ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టాలకు ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా చెల్లిస్తామనగా, 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసినా బీమా చెల్లింపు అడ్రస్ లేదు. కొన్నేళ్లుగా ప్రభుత్వం సొంతంగా బీమా అమలు చేయడంతో కొంచెం ఆలస్యమైనా, అందరికీ న్యాయం జరగకపోయినా, ఇ-క్రాప్ నమోదుల్లో అవకతవకల వలన అక్కడక్కడ అక్రమాలు జరిగినా, రైతులకు కొంత మేరకైనా ఇన్సూరెన్స్ సొమ్ము అందింది. ఇప్పుడు కేంద్ర పథకంలో చేరి, ప్రైవేటు కంపెనీలకు అమలు బాధ్యత అప్పగించడంతో క్లెయిముల్లో విపరీతమైన జాప్యం జరగడంతో పాటు పలు కొర్రీలు పడుతున్నాయని తెలుస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

అభ్యుదయ భావజాల బాటసారి

నేడు యార్లగడ్డ రామనాథం సంస్మరణ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుది వరకూ కమ్యూనిస్టు ఉద్యమంతో నడిచి, కుటుంబాన్నీ ఆ దిశగా ప్రోత్సహించిన యార్లగడ్డ రామనాథం సంస్మరణ సభ నేడు. విజయవాడలోని సున్నపు బట్టీల సెంటర్ వద్ద గల అమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తను నమ్మిన సిద్ధాంతాన్ని కడవరకూ ఆచరించడమే కాకుండా కుటుంబం మొత్తాన్ని అదేబాటలో నడపటం అరుదైన విషయమే. కమ్యూనిస్టు సిద్ధాంతం గొప్పది, దాన్ని నమ్మితే అభివృద్ధే తప్ప వెనకడుగు ఉండదని కుటుంబ సభ్యులకు బోధించి ఆచరింపజేసి అదే బాటలో నడిపించిన అభ్యుదయ భావజాల బాటసారి యార్లగడ్డ రామనాథం. చివరి వరకూ తను నమ్మిక కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి చివరికి తన భౌతికకాయం కూడా సమాజాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో తమ ప్రాణాలు పోయిన తరువాత తనతోపాటు, తన భార్య భౌతికకాయాలను అభివృద్ధిపరమైన వైద్యశాస్త్ర ప్రయోగాలకు ఇవ్వాలని కోరిన గొప్ప మనస్తత్వం కలిగిన వ్యక్తి రామనాథం అనడంలో సందేహం లేదు. అంతకుముందే భార్య చనిపోయిన సమయంలోనూ ఆమె భౌతికకాయాన్ని కూడా వైద్య ప్రయోగాలకు స్వయంగా అప్పగించారు. కమ్యూనిస్టు పార్టీని నమ్మండి మంచి ఆలోచనలే వస్తాయి. నీతి నిజాయితీ ఉంటుంది అని కుటుంబ సభ్యులకు చెప్పి వారిని అదేబాటలో నడిపించారు. వ్యాపారంలోనూ నిజాయితీ ఉండాలని,



నకిలీ వస్తువులు కొనుగోలుదారులకు అమ్మితే వారు నష్టపోతారని, కమ్యూనిస్టు భావజాలం దానికి పూర్తి విరుద్ధమని నమ్మి, ఆచరించి వ్యాపారంలోనూ అదేబాట నడిచారు. పిల్లలను నడిపించారు.

యార్లగడ్డ రామనాథం 1934లో కృష్ణాజిల్లా గుడివాడ ప్రాంతంలోని పోలుకొండలో జన్మించారు. చిన్నతనం నుండి అభ్యుదయ భావజాలంతోనే ఉండేవారు. కస్తూరితో వివాహం అనంతరం ఆమెనూ కమ్యూనిస్టు భావజాలం వైపు నడిపించారు. యుక్తవయసులోనే తెలంగాణా సాయుధ పోరాటంలో అండర్ గ్రౌండ్‌లో ఉండిపనిచేసే నాయకులకు సహాయ సహకారాలు అందించేవారు. అగ్రనాయకులకు షెల్టర్ కల్పించడంతోపాటు వారికి భోజనం అందించడం, సమాచారాన్ని చేరవేయడం వంటి పనులు చేసేవారు. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా జరిగిన భూపోరాటంలో తనవంతు పాత్ర పోషించారు. రామనాథం దంపతులకు నలుగురు పిల్లలు నిర్మల, సుబ్బారావు, వెంకటేశ్వరరావు (వైవి), వెంకటరమేష్. వారందరూ కమ్యూనిస్టు భావజాలంతోనే ఉద్యమంలో ఉన్నారు. నిర్మలకు వివాహమై హైదరాబాద్‌లో ఉంటున్నారు. అభ్యుదయ సాహిత్య అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. రెండో సంతానం సుబ్బారావు విజయవాడ పారిశ్రామిక రంగ, సేవా రంగ అభివృద్ధికి కృషిచేశారు. ఆటోనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఛైర్మన్‌గా అతిపెద్ద ప్రాజెక్టును పూర్తి చేయించారు. బాలోత్సవాలకు సంబంధించి నగరంలో చురుకుగా వ్యవహరిస్తూ కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. మూడో సంతానమైన వై.వెంకటేశ్వరరావు ప్రస్తుతం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు. అంతకుముందు విద్యార్థి ఉద్యమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర, జాతీయ నాయకులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమ క్రమంలో జైలు జీవితం అనుభవించారు. నాలుగో సంతానం వెంకట రమేష్ విజయవాడలో తండ్రి వారసత్వాన్ని నిలబెడుతూ వ్యాపార రంగంలో ఉన్నారు. ఎవరు ఏ పనిలో ఉన్నా దాని వెనుక కమ్యూనిస్టు భావజాలం కచ్చితంగా ఆచరించాలని వారికి నేర్పించడంతో అదేబాటలో పయనిస్తున్నారు.

చల్లపల్లి జమిందారీ పోరాటం అనంతరం రామనాథం కుటుంబం విజయవాడకు చేరుకుంది. ప్రస్తుత సీతారాంపురం పరిధిలో దుర్గాఅగ్రహారంలో అప్పటి సిపిఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య నివాసం ఉన్న ప్రాంతంలో ఆయన ఇంటికి సమీపంలోనే రామనాథం కుటుంబం కూడా ఉండేది. కుటుంబ అవసరాల కోసం వ్యాపారం చేస్తున్నా కమ్యూనిస్టు భావాలను, ఆ పార్టీలో పనిచేయడాన్ని మాత్రం ఆపలేదు. కుటుంబ సభ్యులను కమ్యూనిస్టు పార్టీవైపు వెళ్లాలని ప్రోత్సహించేవారు. అందులో మనుషులు నిజాయితీగా ఉంటారనీ, ఆలోచనలూ సామాజిక అభ్యుదయ కోణంలో ఉంటాయని చెప్పి ప్రోత్సహించేవారు. అదే సమయంలో చదువులోనూ ముందుండాలని కోరేవారు. వ్యాపారంలోనూ అదే భావజాలంతో ఉంటే వినియోగదారులపట్ల గౌరవం ఉంటుందని, అప్పుడే మనసుకు ఎంతో కొంత తృప్తిగా ఉంటుందని బోధించేవారు. అటువంటి రామనాథం వయోభారంతో 89 సంవత్సరాల వయసులో ఈ నెల 15న తుదిశ్వాస విడిచారు. చివరిక్షణం వరకూ అదేబాటలో నడవడంతోపాటు తన శరీరాన్ని వైద్య పరిశోధనలకు పంపించాలని కోరిన ధన్యజీవి రామనాథం.

'పది' స్పాట్ వాల్యుయేషన్ మృతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్ (బాపట్ల జిల్లా)

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో మరణించిన సిబ్బందికి రూ.50 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలని ఎయిడెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిడపర్తి పేరిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మరణించిన కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, మరణించిన ఉపాధ్యాయునికి సంబంధించిన గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యాల అన్ని బకాయిలు 15 రోజుల్లోపు వారి కుటుంబసభ్యులకు అందజేయాలని కోరారు. రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సిబ్బందికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేదని తెలిపారు. ఎయిడెడ్ సిబ్బందికి హెల్త్ కార్డు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తాం : టిడిపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చంద్రబాబుపై జరిగిన హత్యాయత్నంపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎపిలో జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రాష్ట్రంలో పర్యటనను పోలీసుల అనుమతితో చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం నాటి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి ఆదిమూలపు సురేష్ బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేశారని, మంత్రి సురేష్ ముందే పర్యటన అడ్డుకుంటామని ప్రకటన ఇచ్చారని అన్నారు. చంద్రబాబు వెళ్లే మార్గంలో దాడికి ముందే ఏర్పాట్లు చేశారని, పోలీసులు దాడి చేసే వారికి అన్ని విధాలా మద్దతుగా ఉన్నారని అన్నారు. ఎన్ఎస్‌జి అధికారి సంతోష్ కుమార్‌కు గాయాలయ్యాయని, శాంతిభద్రతల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు,
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ఆహ్వానపు ప్రకటన (http://irep.gov.in ద్వారా)
PUB/0410

భారత రాష్ట్రపతి తరపున, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (నిర్మాణము), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు, టెండరింగ్ చేయుటకు సింగిల్ ప్యాకెట్ విధానంలో ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1. నిట్ నం.: ఇ(జిఎన్)/సిఎన్/2023-2024, తేది: 21.04.2023. **పని పేరు:** టెండరు నం. 01-2023-2024-ఇ-జిఎన్-సిఎన్: హైదరాబాద్ డివిజన్: ఎంటిబి-కెపిహెచ్ఐ సెక్షన్, మనోహరాబాద్-కొత్తపల్లి స్టేషన్ల మధ్య, కొత్త బిజి లైన్ యొక్క ప్రతిపాదిత నిర్మాణము. సిద్దిపేట్ చైనేజి నం. కి.మీ.-77.00 నుండి సిరిసిల్లా చైనేజి నం. కి.మీ.-110.00 మధ్య పవర్ లైన్ క్రాసింగ్స్ టెంటేటివలి 120 నం.లు (ఎల్‌టి-94 నం.లు, 11కెవి-15 & 11కెవి డిటిఆర్-8, 33కెవి-3 నం.లు) మార్చుట/ఆధునీకరించుట. **అంచనా విలువ (రూ):** 7,33,01,014/- **ధరావత్తు (రూ):** 5,16,500/- **పత్రం ధర:** నిల్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 (నెలలు). **ముగింపు తేది:** 15.05.2023న 15.00గం.లకు.

క్ర.సం.: 2. నిట్ నం.: ఇ(జిఎన్)/సిఎన్/2023-2024, తేది: 21.04.2023. **పని పేరు:** టెండరు నం. 02-2023-2024-ఇ-జిఎన్-సిఎన్: ఎలక్ట్రికల్ కన్‌స్ట్రక్షన్: ఎఎన్ఇయక్స్ నుండి ఆర్ఎన్ఎన్- 5(ఐదు) సం॥ల కాలవ్యవధి కొరకు ఆర్ఎన్ఎన్‌కు అనెక్స్ వద్ద జాన్సన్ తయారీ లిఫ్టుల వార్షిక నిర్వహణా కాంట్రాక్టు. **అంచనా విలువ (రూ):** 14,27,307/- **ధరావత్తు (రూ):** 28,600/- **పత్రం ధర:** నిల్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 5 (సం॥లు). **ముగింపు తేది:** 15.05.2023న 15.00గం.లకు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ http://irep.gov.in ను లాగిన్ చేయండి.
2. ధరావత్తు మరియు టెండరు పత్రం ధర చెల్లింపులు కేవలం నెట్ బ్యాంకింగ్/ ఐఆర్ఇపిఎస్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులోని గేట్‌వే సదుపాయాల చెల్లింపుల ద్వారా చెల్లించవలెను.
3. టెండరుదారు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండరు దాఖలుచేయు కాలవ్యవధికి ఏదైతే, ముగింపు కాలవ్యవధికి వదిహేను రోజుల్లోగా దాఖలుచేయవలెను.
4. టెండరుదారు ఏవేని సవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి) కొరకు, టెండరు దాఖలుచేయు కాలవ్యవధి ప్రారంభ తేది వరకు వీక్షించవచ్చును.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, నిర్మాణము, సికింద్రాబాద్

ఇ-టెండరు ప్రకటన నం. 03-2023 తేది: 21.04.2023
PUB/0411

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/గాటి శక్తి యూనిట్/గుంతకల్ వారు వ్యవహరిస్తూ, దిగువ పని కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు. **ముగింపు తేది& సమయం:** 15.05.2023న 11:00గం.లకు.

క్ర.సం.: 1. **టెండరు నం.:** జిఎస్‌యు-జిటిఎల్-లిఫ్టు-11. **పని వివరణ:** ఎస్‌డబ్ల్యు-1: రైల్వే స్టేషన్లు (ధర్మవరం మరియు యాద్గిర్ స్టేషన్ వద్ద 02నం.ల చొ॥న) లిఫ్టులు 04నం.లు ఏర్పాటుచేయుట. ఎస్‌డబ్ల్యు-2: రైల్వే స్టేషన్ల వద్ద లిఫ్టులు 2నం.లను ఏర్పాటుచేయుట (సిటిఒ-2నం.లు). **ప్రకటిత విలువ (రూ):** 67,54,798.16 పై.లు **ధరావత్తు డిపాజిట్ (రూ.)లలో:** 1,35,100/-

బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు http://irep.gov.in కు లాగిన్‌చేయండి. ఏవేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/ గాటి శక్తి/ గుంతకల్

ఇ-టెండరు ప్రకటన నం.: ఎస్& టి/09/2023 తేది: 21.04.2023
PUB/0412

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ సిగ్నల్& టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ (మెయింటేనెన్స్) దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ వారు దిగువ పని కొరకు 15.05.2023న 15.00గం.ల వరకు ఇ-టెండర్లు (బహిరంగ)ను ఆహ్వానిస్తున్నారు.

టెండరు నం.: 01-ఎస్ఎన్‌టి-09-2023. **పని వివరణ (సిగ్నల్ & టెలికం పని):** సిటిఒ, టియు, ఎంఎఎల్ఎం, డిహెచ్ఎన్ఇ, పిఐఎల్, ఎంపిఎల్ & కెఆర్‌వై స్టేషన్ల వద్ద కోచ్ ఇండికేషన్ బోర్డులు, ట్రైన్ ఇన్ఫర్మేషన్ బోర్డులు, డిజిటల్ క్లాక్స్, ఎల్ఇడి టివిలు& పిఎ సిస్టమ్ ఏర్పాటుచేయుట. **ప్రకటిత పని టెండరు విలువ (రూ):** 5,89,70,846.46 పై.లు **ధరావత్తు డిపాజిట్ (రూ):** 4,44,900/-**పూర్తిచేయు కాలవ్యవధి:** 09 నెలలు.

ఆఫర్ చెల్లుబాటు తెరచు తేదీ నుండి 45 రోజులుగా ఉండవలెను. ఒకవేళ అవసరమైనచో పై టెండరు ప్రకటన కొరకు సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్& టెలికం ఇంజినీర్, (ఎం), గుంతకల్
A0574

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైటు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

లెనిన్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద దోపిడీని ఎదుర్కోవాలి

- జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచంలో జరుగుతున్న సామ్రాజ్య వాద దోపిడీని లెనిన్‌స్ఫూర్తితో ఎదుర్కో వాలని పలవురు వక్తలు పిలుపునిచ్చారు. కారల్‌మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యాన లెనిన్ 153వ జయంతి కార్యక్రమం విజయవాడ లెనిన్ సెంటర్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు మార్క్సిజం లెనినిజం ప్రాధాన్యత, కమ్యూనిజం ఆవశ్యకత పెరిగిం దని అన్నారు. మార్క్సిజాన్ని, లెనినిజాన్ని లోతుగా అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకు అన్వయింపజే యాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మార్క్సిజం ఒక శాస్త్రమని అన్నారు. రాజనీతి శాస్త్రాన్ని, ఎత్తుగడల పంథాతో బలమైన విప్లవాన్ని నిర్మించిన గొప్ప వ్యక్తి లెనిన్ అని చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందని ముందే చెప్పిన అంతర్జాతీయ నాయకుడు లెనిన్ అని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంతో ఎన్ని మార్పులు జరిగినా ప్రపంచ చరిత్రలో తనకుంటూ ఒక విలువైన సుస్థిర స్థానం సంపాదించుకున్న వ్యక్తి లెనిన్ అని చెప్పారు. నేటికీ అక్టోబరు విప్లవం, లెనిన్ మహాశయుని ఖ్యాతి ఏమాత్రం తగ్గలేద న్నారు. కొత్త పద్ధతుల్లో మార్క్సిజం, లెనినిజం భారతదేశంలో అన్వయించడానికి వామపక్ష మేధావులు ఆలోచించాలని కోరారు. సాహితీవేత్త దివికుమార్ మాట్లాడుతూ లెనినిజాన్ని సిద్ధాంత రూపంలో చెప్పిన వ్యక్తి స్టాలిన్ అని అన్నారు. ప్రపంచం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వచ్చిందే కార్మిక విప్లవం అని చెప్పారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ లెనిన్ రాసిన అనేక పుస్తకాలు ఆలోచింపజేస్తున్నాయని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, న్యూడెమోక్రసీ నాయకులు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ నుంచి మాన వాళిని విముక్తి చేయడానికి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కళాకా రులు అభ్యుదయ గీతాలు ఆలపించారు. నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, సిపిఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నరసింహారావు, డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ -5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్‌ను అడ్డుకున్న రైతులు

24న రాజధాని గ్రామాల్లో ప్రజాచైతన్య పాదయాత్ర

ఐనవోలులో ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలోని ఆర్-5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను రాజధాని రైతులు అడ్డుకున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా ఐనవోలు, కురగల్లులో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు సిఆర్‌డిఎ అధికారులు శనివారం రెండో రోజు జెసిబిలతో వచ్చారు. స్థానిక రైతులు అక్కడకు చేరుకుని జంగిల్ క్లియరెన్స్‌ను అడ్డుకున్నారు. ఆర్ 5 జోన్ అంశం హైకోర్టు పరిధిలో ఉండగా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. దీంతో కురగల్లులో ముగ్గురు రైతులను పోలీసులు అరెస్టు చేసి మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించారు. తుళ్లూరు మండలం ఐనవోలులో జంగిల్ క్లియరెన్స్ పనులను రైతులు అడ్డుకుని జెసిబిని వెనక్కి పంపారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని ప్రాంతంలోని 1,134 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 45 జారీ చేసింది. ఈ జిఒకు వ్యతిరేకంగా రైతులు కోర్టును ఆశ్రయించారు. రాజధాని అమరావతిలో రాజధానేతర వాసులకు ఇళ్ళ స్థలాల పంపిణీ అంశం కోర్టుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు జంగిల్ క్లియరెన్స్ అంటూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందని రైతులు మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇచ్చిన భూముల్లో ముళ్ల కంపలు పెరిగి అడవిలా మారినా అమరావతిలో ఏనాడూ జంగిల్ క్లియరెన్స్ చేపట్టని ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ అంటూ హడావిడి చేస్తోందని విమర్శించారు. మాస్టర్ ప్లాన్‌కు తూట్లు పొడిచేలా సిఆర్‌డిఎ చట్ట సవరణ ద్వారా జిఒ 45 తెచ్చి పేదల ముసుగులో ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కోర్టు తీర్పు రిజర్వ్‌లో ఉన్నప్పటికీ లెక్కచేయకుండా ప్రభుత్వం దుందుడుకుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు.

24న ప్రజాచైతన్య పాదయాత్ర : అమరావతి రాజధాని రైతు జెఎసి

అమరావతిపై ప్రభుత్వం చేస్తోన్న విధ్వంసానికి అడ్డులేకుండా పోయిందని అమరావతి రాజధాని రైతు జెఎసి నాయకులు అన్నారు. వెలగపూడిలోని జెఎసి కార్యాలయంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. అమరావతి విధ్వంసా నికి నిరసనగా ఈ నెల 24న ప్రజా చైతన్య పాదయాత్ర చేపట్టనున్నట్లు జెఎసి సమన్వయ కమిటీ సభ్యులు పువ్వాడ సుధాకరరావు తెలిపారు. పాదయాత్ర కృష్ణాయపాలెం, మందడం, అయినవోలు, కురగల్లు మీదుగా నిడమర్రు చేరుకుంటుందని అక్కడే సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. 28న తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద నిరసన, ముట్టడి, మే 2న గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల లో వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించ కుంటే ధర్నాలు, ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో అమరావతి దళిత మహిళా జెఎసి కన్వీనర్ అంకం సువర్ణ కమల, దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య, జూజాల చలపతిరావు, ఆవల రవి కిరణ్, గుర్రం జయకృష్ణ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- విద్యాశాఖ అధికారులను హెచ్చరించిన ప్రవీణ్ ప్రకాష్
- ఎంఇఒ, హెచ్ఎం, ఇద్దరు టీచర్లపై చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే వర్క్‌బుక్‌లో ఒక్క పేజీ కూడా పూర్తి చేయించకుండా ఏం చేస్తున్నారని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులను ప్రశ్నించారు. రూ.లక్షల జీతం తీసుకుంటూ విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించడంలేదని మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో కండ్రవీధి, మెయిన్ బజారులోని

వర్క్ పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

పాఠశాలల విద్యార్థుల ఇళ్లకు శనివారం వెళ్లి వారి సామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు.

విద్యార్థులకు హోం వర్క్ చేయించడంలో అలసత్వం ప్రదర్శించడంపై కండ్రవీధిలోని ప్రాథమిక ఒడియా పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు శ్యామలా దేవి, టెక్కలి మెయిన్ బజారులోని పాఠశాల ఉపాధ్యాయులు ఎ.సురేష్, రమణ, పర్యవేక్షణా లోపంపై అసహనం వ్యక్తం చేశారు. వారితోపాటు మండల విద్యాశాఖాధికారి డి.నాగభూషణంను కూడా సస్పెన్షన్ చేయాలని ఆర్‌జెడి జ్యోతికుమారిని ఆదేశించారు. ఆరు నెలలపాటు ఇన్‌ఛార్జ్ డిఇఒగా పని చేసిన పగడాలమ్మపై అసహనం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించలేనప్పుడు బాధ్యతల నుంచి తప్పుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, తహశీల్దార్ బెండి గిరి తదితరులున్నారు.

వసంత కుమార్ మరణం తీరని లోటు

ప్రజాశక్తి-అమలాపురం

వసంతకుమార్‌కు నివాళులర్పిస్తున్న సుబ్బారావు

వసంత కుమార్ 35 ఏళ్లుగా వివిధ ప్రజా సంఘాల్లో నాయకునిగా పని చేశారని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో వసంత కుమార్ మరణించిన విషయం తెలిసిందే. వసంత కుమార్ కుటుంబ సభ్యులను శనివారం దడాల సుబ్బారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐను అమలాపురం లో వసంతకుమార్ ద్వారానే ప్రారంభించామని గుర్తు చేశారు. కొంతకాలం ట్రేడ్ యూనియన్, కౌలు రైతు సంఘంలో పనిచేశారని, ప్రస్తుతం కెవిపిఎస్‌లో ఉన్నారని తెలిపారు. పార్టీ ఇచ్చే ఏ కర్తవ్యమైనా ఆయన పట్టుదలతో అమలు చేసేవారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వసంత కుమార్ కుటుంబ సభ్యులను అమలాపురం జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, వైసిపి నాయకులు పినిపే జయరాజు, సరెళ్ల రామకృష్ణ, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, ఆర్‌పిఐ నాయకులు సుధీర్, వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా కార్యదర్శి జివి.రమణ, విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ, చింతా రామకృష్ణ పరామర్శించారు.

అప్పుడే ఓడీలోకి..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలోనే ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఒకవైపు రుణం, మరోవైపు ఓడీకి వెళ్లాల్సి రావడం గమనార్హం. ఇప్పటివరకు రెండుసార్లు బహిరంగ మార్కెట్ రుణాలకు వెళ్లిన ఆర్థికశాఖ రూ.మూడు వేలకోట్లు సమీకరించుకోగా, మరో రూ.మూడు వేల కోట్లకు ప్రతిపాదన సిద్ధం చేసి రిజర్వ్‌బ్యాంకుకు పంపింది. దీంతో మొత్తం రుణం రూ.6 వేల కోట్లకు చేరుకుంది. తాజాగా రూ.147 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌కు కూడా వెళ్లింది. కేంద్రం నుంచి ఇంకా వాటా నిధులు, సాయం నిధులపై స్పష్టత రాకపోవడంతో దైనందిక అవసరాల కోసం రుణాలకు వెళ్లాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు.

జగన్ దంపతుల్ని విచారించాలి : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో అసలు సూత్రధారులైన జగన్‌ను, ఆయన సతీమణి భారతిని విచారిస్తేనే కేసు కొలిక్కి వచ్చినట్లు అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు కేవలం పాత్రధారుల్నే సిబిఐ విచారించిందని శనివారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వివేకా హత్య వెనుక కుటుంబ సభ్యులే ఉన్నారని టిడిపి తొలి నుంచి చెబుతోందన్నారు. జగన్ సొంత మీడియాతో ఇష్టమొచ్చినట్లు ప్రజల్ని నమ్మించడానికి తప్పుడు ప్రచారం చేయించారని విమర్శించారు. వివేకా హత్య జరిగినప్పటి నుంచీ ప్రజల మెదళ్లను తొలుస్తున్న అనేక ప్రశ్నలకు సిఎం దంపతులు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు.

హెల్త్ 'వర్సిటీ'లో వైఎస్ఆర్ విగ్రహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో కీలకమైన ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును గత నవంబరులో వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ సైన్సెస్‌గా మార్పు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే యూనివర్సిటీ ప్రాంగణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిపై తాజాగా జరిగిన యూనివర్సిటీ బోర్డు భేటీలో నిర్ణయం తీసుకున్నారు. వైఎస్ఆర్ విగ్రహాన్ని యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటుచేయడం ఆయనకు నిజమైన నివాళిగా విశ్వవిద్యాలయ యాజమాన్యం తన ప్రతిపాదనలో పేర్కొంది..

గూగుల్ బాస్‌కు రూ.1,850 కోట్ల పారితోషికం

- సాధారణ ఉద్యోగితో పోల్చితే 800 రెట్లు అధికం
- మరోవైపు సిబ్బందికి ఉద్వాసన

న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్‌లో పొదుపు చర్యల్లో భాగంగా ఓ వైపు వేలాది ఉద్యోగులను ఇంటికి పంపిస్తుండగా.. ఆ సంస్థ బాస్‌కు మాత్రం కళ్లు చెదిరిపోయే పారితోషకాన్ని అందిస్తోంది. గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ ఏకంగా 226 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,850 కోట్లు) పారితోషికం తీసుకున్నారని రిపోర్టులు వస్తున్నాయి. ఇది కంపెనీలో సగటు ఉద్యోగి వేతనంతో పోల్చితే 800 రెట్లు ఎక్కువగా కావడం విశేషం. ఈ పారితోషికంలో 218 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ అవార్డులను అందుకున్నారని ఆల్ఫాబెట్ శుక్రవారం రెగ్యులేటరీకి వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో 12వేల మంది ఉద్యోగులను తీసివేయనున్నట్లు ప్రకటించింది. మాంద్యం భయాల నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. ఇది ఆ కంపెనీ మొత్తం సిబ్బందిలో ఆరు శాతానికి సమానం. మరోవైపు గూగుల్ బాస్‌కు భారీగా ముడుతున్నప్పటికీ.. క్రింది స్థాయి ఉద్యోగులకు మాత్రం ప్రోత్సాహకాల చెల్లింపుల్లో మొండి చెయ్యి చూపిస్తున్నారు. ఉన్న సిబ్బంది బోనస్‌ల్లోనూ కోతలు విధించనున్నట్లు జనవరిలో పేర్కొంది. వ్యయాల నియంత్రణ కేవలం ఉద్యోగుల తొలగింపులతోనే ఆగిపోదని పిచాయ్ అప్పట్లో తెలిపారు. బాధ్యతాయుత నాయకత్వ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బోనస్‌ల్లోనూ కోతలు పెట్టనున్నామన్నారు. ఉద్యోగులందరికీ ఈ ఏడాది బోనస్‌లు తగ్గుతాయని ఆయన స్పష్టం చేశారు.

ఉడ్‌ఛలో నుంచి ఇవి 'వీర్ బైక్'

హైదరాబాద్ : కన్స్యూమర్ టెక్ సంస్థ ఉడ్‌ఛలో అధునాతన విద్యుత్ వాహనం 'వీర్‌బైక్'ను విడుదల చేసినట్లు ప్రకటించింది. పర్యావరణ అనుకూల, అందుబాటు ధరల్లో రవాణా అవకాశాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే కంపెనీ ప్రయత్నాలలో ఇది ఓ భాగమని వీర్ బైక్ కో-ఫౌండర్, ఆర్అండ్‌డి హెడ్ సాహిల్ ఉత్తేకర్ తెలిపారు. "అత్యున్నత పనితీరు కనబరిచే విద్యుత్ సైకిల్ వీర్ బైక్. సౌకర్యవంతమైన, మృదువైన సవారీని ఇది అంది స్తుంది. అత్యంత కఠినమైన పరిస్థితులను సైతం తట్టుకునేలా తీర్చిదిద్దాము. రోజువారీ వినియోగా నికి అత్యంత అనుకూలమైనది." అని సాహిల్ పేర్కొన్నారు. భారతీయుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని తయారు చేశామని ఉడ్‌ఛలో సిఇఒ రవి కుమార్ తెలిపారు. ఇది తమ వీర్‌బైక్ డాట్ కామ్‌లో విక్రయాలకు అందుబాటులో ఉంటుందన్నారు.

యెస్ బ్యాంక్‌కు కేటాయింపుల దెబ్బ

క్యూ4 లాభాల్లో 45% పతనం

ముంబయి : యెస్ బ్యాంక్ లాభాలకు రాని బాకీలు గండికొట్టాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో యెస్ బ్యాంక్ నికర లాభాలు 45 శాతం పతనమై రూ.202 కోట్లకు పడిపోయాయి. 2022-23లో బ్యాంక్ స్థూల లాభాలు 32.7 శాతం తగ్గి రూ.717 కోట్లుగా నమోదయ్యాయి. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 15.4 శాతం పెరిగి రూ.2,105 కోట్లకు చేరింది. స్థూల డిపాజిట్లలో 10 శాతం వృద్ధి చోటు చేసుకుంది. వడ్డీయేతర ఆదాయం 22.8 శాతం పెరిగి రూ.1,082 కోట్లుగా నమోదయ్యింది. క్రితం క్యూ4లో మొండి బాకీల కోసం చేసే కేటాయింపులు 127 శాతం పెరిగి రూ.618 కోట్లకు చేరాయి. దీంతో లాభాలు తగ్గాయి. 2023-24 రుణాల మంజూరులో 15-20 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని యెస్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. 2022-23లో కొత్తగా 3,000 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు తెలిపారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 27,517కు చేరిందన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ముగ్గురు డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి బ్రాహ్మణ వెల్ఫేర్, అభివృద్ధి కార్పొరేషన్‌లో నాన్ - అఫీషియల్ డైరెక్టర్లుగా ప్రభుత్వం ముగ్గురు సభ్యులను నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ ఆర్‌టి నెంబరు 26ను విడుదల చేసింది. సభ్యులుగా నియమించిన వారిలో త్రిపురారిబొట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ (తెనాలి), పూర్ణానందశర్మ (గాజువాక) వై సాయి సురేష్ (కమలాపురం) నియోజకవర్గాలకు చెందినవారు ఉన్నారు.

టాటా ఎఐఎ లైఫ్ నుంచి ఫార్చ్యూన్ గ్యారంటీ పెన్షన్

న్యూఢిల్లీ : జీవిత బీమా కంపెనీల్లో ఒక్కటైన టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా ఫార్చ్యూన్ గ్యారెంటీ పెన్షన్‌ను విడుదల చేసింది. ఈ యాన్యుటీ (గ్యారెంటీడ్ ఇన్‌కమ్ ఫర్ లైఫ్) ప్లాన్‌లో అత్యధిక యాన్యుటీ రేట్లు, మరణ ప్రయోజనాలు ఉండటంతో వినియోగదారులు తమ గోల్డెన్ ఇయర్స్‌లో ఆర్థికంగా స్వేచ్ఛను పొందగలరని ఆ సంస్థ పేర్కొంది. "వినియోగదారులు ఖచ్చితంగా తమ రిటైర్‌మెంట్ తరువాత ఆర్థిక స్వేచ్ఛకు భరోసా కలిగి ఉండాలి. భవిష్యత్ కోసం ప్రణాళికలు చేసుకునే వివాహితులు, మహిళలు, వ్యక్తులతో పాటుగా ఎస్ఎంఇ వినియోగదారులకు ఈ ప్లాన్ అత్యంత అనుకూలంగా ఉంటుంది." అని టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమిత్ ఉపాధ్యాయ్ పేర్కొన్నారు.

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డోర్ నం.1871ఎ24, విఎం ప్లాజా, సివిల్ లైన్ రోడ్, పలరివాతం, కొచ్చిన్-682025, ఫోన్: 7558865300.

వేలం ప్రకటన

కెఎల్ఎం ఆక్షివ ఫిన్వెస్ట్ లిమిటెడ్, 24.04.2023న తరువాత దిగువ పేర్కొన్న బ్రాంచీలలో ఒక పద్ధతి ప్రకారం తాకట్టుపెట్టబడిన ఐటెంలను బిడ్‌చేయుటకు నిర్ణయించింది, తిరిగి చెల్లించుటలో లేదా వడ్డీతో రినెవల్‌చేసుకొనుటలో ఆసక్తిగల కస్టమర్లు, వేలంవేయు కాలవ్యధికి ముందు వారి సదరు బ్రాంచీలను సంప్రదించగలరు. అయితే, పై కారణాల దృష్ట్యా వేలం బకాయిని తీర్చుటలో విఫలం చెందినచో, ఏదేని ప్రకటన ఇవ్వకుండానే వేలం నిర్వహించుట కొరకు సదరు ప్రదేశంకు వేలంను వాయిదావేయుటకు ఆపరేటర్స్ పూర్తి అధికారాలు కలిగియుంటారు. కెఎల్ఎం ఆక్షివ ఫిన్వెస్ట్ లిమిటెడ్, విఎం ప్లాజా, సివిల్ లేన్ రోడ్, పలరివాతం.

2వ వేలం తేది& సమయం: 29.04.2023, ఉ॥ 10.00గం.లు, వేలం కేంద్రం: మొదటి అంతస్తు, శ్రీ కృష్ణ నిలయం, బ్యాంక్ ఆఫ్ బరోడా పైన, గవర్నర్‌పేట్, ఏలూరు రోడ్, కృష్ణా, 520002 (కృష్ణా జిల్లా). **కంకిపాడు** 202204100100069, **మచిలీపట్నం** 202204200100018 202204200100019 202204200100023 202204200100025 202204200100040 202204200100046 202204200100048 **పొరంకి** 202203990100013 202203990100033 202203990100043 202203990100049 202203990100051 202203990100054 202203990100057 202203990100058 202203990100061 202203990100063 **వుయ్యూర్** 202203850100013 202203850100023 202203850100048 202203850100067 202203850100068 202203850100071 202203850100075 202203850100080.

సంపాదకీయం

చరిత్ర చెప్పిన సత్యం

చరిత్రను వక్రీకరించడం జనసంహారం చేసే మారణాయుధం కంటే ప్రమాదకరం. ఈ వక్రీకరణ నేడు దేశం ఎదుర్కొంటున్న ఓ ప్రమాదం. గతం మీదనే పటిష్టమైన భవిష్యత్ నిర్మితమౌతుంది. మనల్ని మనం తెలుసుకోవడం కోసం చరిత్రను అధ్యయనం చేయాలి. గతాన్ని అధ్యయనం చేసిన వారు మాత్రమే వర్తమానంలో చరిత్రను సృష్టించగలుగుతారు. భవిష్యత్‌ను అంచనా వేయగలుగుతారు. అలాంటి చరిత్ర సైన్స్ ఆధారితంగా... శాస్త్రీయ దృక్పధంతో ముడిపడి వుండాలి. చరిత్ర అంటే రాజులు, వారి జీవనశైలి, విజయాల గురించి మాత్రమే మాట్లాడే రాజపత్రం కాదు. చరిత్రంటే అన్ని వర్గాల ప్రజలను, వారి జీవన విధానాన్ని ప్రతిబింబించాలి. భావితరాలకు మార్గదర్శి కావాలి. 'ఈ రాణి ప్రేమ పురాణం/ ఆ ముట్టడికైన ఖర్చులు/ మతలబులూ, కైఫీయతులూ/ ఇవి కావోయ్ చరిత్ర సారం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. జీవ పరిణామ క్రమంపై 1859లో డార్విన్ రాసిన 'జాతుల ఆవిర్భావం' సిద్ధాంతం ఒక చారిత్రక సంచలనం. ఇదేదో ఊహాజనిత వాదం కాదు. విస్తృత పరిశీలన, అధ్యయనమే డార్విన్ సిద్ధాంత చారిత్రిక ప్రయాణం.

సృష్టివాదాన్ని వ్యతిరేకించడం దైవద్రోహం అని మతవాదుల వాదన. సకల చరాచర జగత్తు భగవదానుగ్రహం అని విశ్వసిస్తున్న కాలంలో ఒక వినూత్న ఆలోచనకు బీజం వేసిన వాడు-ప్రకృతి, జీవ, భూగర్భ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. ఈయన రూపొందించిన జీవ పరిణామ మూలం, పరిణామ సంబంధాలు, శిలాజాలు, మానవ పరిణామక్రమం చాప్టర్లను సిబిఎస్‌ఇ పదో తరగతి సిలబస్ నుంచి తొలగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తాజా నిర్ణయం. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు జీవ పరిణామ క్రమ సిద్ధాంతమే తప్పని వాదిస్తారు. సైన్స్ విద్యకు ఈ నిర్ణయం 'ప్రమాదకరమైన మార్పు' అని 1800 మంది శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, పలువురు విద్యావేత్తలు లేఖ రాశారు. సైన్స్ ప్రాథమిక ఆవిష్కరణ గురించి విద్యార్థులకు తెలియకపోతే... వారి ఆలోచనా ధోరణి కుంటుపడుతుంది. దీనికి కొద్దిరోజుల ముందు మొఘలుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్ర భాగాల్ని తొలగించారు. వీటిని చరిత్రలో లేకుండా చెరిపివేయడం భారతీయ చరిత్ర అవగాహనకు హానికరం. ఈ తొలగింపులు, వక్రీకరణలు భావితరాలను తప్పుదోవ పట్టిస్తాయి. 'చరిత్ర అంటే రాజులు, రాజ్యాలే కాదు...మానవ జీవితాలను మలుపు తిప్పిన పరిణామాలనూ చూడాలి' అంటారు ప్రముఖ చరిత్రకారుడు డి.డి. కోశాంబి. 'చివరి మొఘల్ చక్రవర్తి కొన్ని ఆలయాలను కూల్చిన మాట వాస్తవమే. కానీ, అది మాత్రమే వేయేళ్ల ముస్లిం పాలనకు ప్రతీక కాదు' అంటారు దాశరథి రంగాచార్య 'ఋగ్వేద సంహిత' గ్రంథంలో. ఎన్నో మూఢనమ్మకాలను శాస్త్ర వాదనల ద్వారా, ప్రయోగాల ద్వారా పూర్వపక్షం చేసి, సౌర కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన గెలీలియో సైతం మతాధికారుల ఆగ్రహానికి గురయ్యాడు. ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది. 164 ఏళ్ల తర్వాత ఇప్పుడు డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుడు సిద్ధాంతంగా వక్రీకరించేందుకు మళ్లీ మతోన్మాదులే పూనుకున్నారు.

జీవం ఎలా మొదలైంది? జీవరాసులు ఎలా వచ్చాయి? మానవ పరిణామ క్రమం ఎలా జరిగింది? వంటి విషయాలు ప్రతి ఒక్కరికీ అవగాహన కావాలి. ప్రకృతిలో లక్షల ఏళ్లుగా జరుగుతున్న మార్పుల ఫలితంగానే జీవ పరిణామ క్రమం ఏర్పడిందని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఈ శాస్త్రీయతను వక్రీకరించి...అశాస్త్రీయ విషయాలకు కృత్రిమ ప్రచారం కల్పించి, భావితరాలను అంధకారంలోకి నెట్టే ఎలాంటి ప్రయత్నాన్నైనా విజ్ఞులు తిరస్కరించాలి. డి.డి. కోశాంబి 'ప్రజలు తమకు తెలియకుండానే చరిత్రను నిర్మించుకుంటూపోతారని, ఆ క్రమంలో వారి సామూహిక జీవన స్వచ్ఛత, ఔదార్యం, సంస్కృతి, శ్రమ- అన్నీ కలగలిపి నిబిడీకృతమై వుంటాయని' విశదీకరిస్తారు. కానీ, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం పాఠ్యాంశాల్లో విద్వేష విష బీజాలు నాటేందుకు పూనుకుంది. గాంధీజీ హత్యలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్రను కూడా చెరిపేసి, చరిత్రకు మసిపూసి మారేడుకాయ చేయాలని ప్రయత్నిస్తోంది. అనేక మంది విద్యావేత్తలు, చరిత్రకారులు ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించిన చరిత్ర పాఠాలను తొలగించడం, వక్రీకరించడం అంటే...దేశ చారిత్రక మూలాలను విధ్వంసం చేయడమే. ఇలాంటి ప్రయత్నాలను ఈ దేశ ప్రజలే తిప్పికొట్టాలి.

మహనీయుని మాట



సంపద ఒకవైపు పోగుపడ్డప్పుడు... రెండోవైపు బానిసత్వం, పీడన, అలక్ష్యం, దౌర్జన్యం, మానసిక అశాంతి పోగుపడతాయి.

- కారల్ మార్క్స్

Karl Marx

బిజెపిపై పోరాటం ప్రజాస్వామ్యానికి తొలి పాఠం

ప్రస్తుతం

ఎ.పి, తెలంగాణ రాజకీయాలు దేశ రాజకీయాలలో భాగం తప్ప విడిగా వుండవు. ఆ రాజకీయాలను నిశితంగానూ జాగ్రత్తగానూ పరిశీలించేవారెవరికైనా బిజెపి పాలన ఎంత ప్రమాదకరంగా తయారైందో తెలుస్తుంది. రాష్ట్రాలను దిష్టిబొమ్మలుగా మార్చి రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కి బిజెపి, మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ నిరంకుశాధికారం చలాయిస్తున్న తీరు గతంలో ఎరగం. ఇందిరాగాంధీ ఎమర్జన్సీ నాటికంటే ఈ అప్రకటిత ఎమర్జన్సీ భయంకరంగా సాగుతున్నది. నేను తల్చుకుంటే మీ ప్రభుత్వం వుండేదా అని తెలంగాణ గవర్నర్ తమిళిసై కెసిఆర్‌ను ప్రశ్నిస్తారు. అనేక బిల్లులపై సంతకం చేయకుండా ప్రతిష్టంభన సృష్టిస్తే ఆ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. అక్కడ ఏవో అంగీకరించినట్టు చెప్పి మళ్లీ షరామామూలే!

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తరచూ ఒక అంశంపై చర్చ తప్పించబడుతుంటుంది. ఈ దేశాన్ని తొమ్మిదేళ్లుగా పాలిస్తూ మరోసారి వచ్చేది మేమేనంటున్న బిజెపి గురించి, దాని విధానాల మంచి చెడ్డల గురించి, మన పత్రికలు విమర్శనాత్మకంగా పతాక శీర్షికలివ్వడం చాలా అరుదు. ప్రైమ్ టైమ్ డిబేట్లు కూడా పెద్దగా వుండవు. ఈ మధ్య తెలంగాణలో బండి సంజయ్ వంటి వారి హడావుడి పెరిగింది గనక, కెసిఆర్ బిఆర్‌ఎస్ స్థాపించి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు గనక ప్రస్తావన వుంటుందేమో గాని ఎ.పి లో అయితే అసలే నాస్తి. బిజెపి కి ఇక్కడ బలమే లేదు. దాని గురించి మాట్లాడటం ఎందుకన్నది అధికార వైసిపి, టిడిపి ల మాట. జనసేన సరే. నేరుగా బిజెపి తోనే చేతులు కలిపింది గనక విమర్శల ప్రసక్తి, కనీసం చర్చ కూడా వుండవు. టిడిపి అధినేత చంద్రబాబు కూడా బిజెపిపై పూర్తి మౌనం పాటించాలని వారి నాయకులకు ఆదేశాలిచ్చారంటారు. ఎవరైనా పెదవి మెదిపితే వెంటనే ఆగ్రహిస్తారు. ప్రధాని మోడీ...బాబును పలకరించారనీ, ఫోన్ చేశారనీ గొప్పగా చెప్పుకుంటారు. మేమే ఆయనకు సలహాలిచ్చాం అని గొప్పలు పోతుంటారు. 2018కి ముందు మతతత్వంపై చెలరేగిపోయిన చంద్రబాబు ఇప్పుడు అదంతా మ్యూట్ చేశారు. ఇక ముఖ్యమంత్రి జగన్, ఆయన పార్టీ, ప్రభుత్వమూ మోడీకి అతి వీర విధేయులు. పదేపదే ఢిల్లీ వెళ్లి ఆయన ఆదేశాలు తీసుకుని, అభ్యర్థనలు సమర్పించి రావడం తప్ప ఇవ్వాల్సిన విశాఖ ఉక్కు వంటి వాటి కోసం పట్టుపట్టిన, ఉద్యమించిన దాఖలాలే లేవు. పోనీ ఇందుకు బిజెపి ప్రతిస్పందన గమనిస్తే ఎ.పి బిజెపి నాయకులు నిరంతరం జగన్ సర్కారుపై దాడి చేస్తుంటారు. అంతర్వేది నుంచి అంతర్యామి శ్రీనివాసుని వరకూ ప్రతి పుణ్యక్షేత్రాలలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. మతపరమైన ఉద్రేకాలు రెచ్చగొట్టడానికి విఫలయత్నాలు చేస్తుంటారు.

తెలకపల్లి రవి

పిల్లి వచ్చె, ఎలకా భద్రం

వైసిపి నాయకులెవరైనా ఎప్పుడైనా రాష్ట్ర బిజెపి వారిని ఒక మాట అంటారు తప్ప కేంద్రం జోలికి పోరు. పైగా మత రాజకీయాలలో తాము తీసిపోమని ముఖ్యమంత్రి గోపూజల్లోనూ దైవదర్శనాలు, పీఠాధిపతుల ఆశీస్సుల స్వీకారంలో పోటీ పడుతుంటారు. రాష్ట్రానికి నిధులివ్వని, హామీలు నెరవేర్చని మోడీ సర్కారుపై ఈ మూడు పార్టీలకూ ఇంత భయమెందుకో మాత్రం చెప్పరు గానీ అందరికీ తెలుసు. వైసిపి ది పరోక్ష మద్దతు, జనసేనది ప్రత్యక్ష మద్దతు, టిడిపిది గత మద్దతు భవిష్యత్‌కై తపస్సు ఇంకా విపరీతమేమంటే రాష్ట్రపతి పాలన విధించాలనీ ఆర్థిక ఎమర్జన్సీ ప్రకటించాలని టిడిపి నేతలు కేంద్రాన్ని కోరుతుంటారు. కేంద్రం చెప్పే విద్యా విధానం, కరెంటు మీటర్లు, డిస్కంలు వంటి ఆదేశాలను బిజెపి సర్కార్ల కంటే ముందు ఎ.పి ప్రభుత్వమే అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుంటుంది. అదే తెలంగాణలో కాంగ్రెస్ గానీ, మరికొన్ని చిన్న పార్టీలూ గానీ కేంద్ర బిజెపి మత రాజకీయాలను పెత్తందారీ పోకడలతో రాష్ట్ర హక్కులు హరించడాన్ని పెద్దగా పట్టించుకోవు. కెసిఆర్ కుటుంబ పాలనను అంతం చేయడమే ఏకైక లక్ష్యమన్నట్టు కేంద్ర జోక్యాన్ని ఆహ్వానిస్తుంటాయి. ప్రతిపక్షాలతో కలిసి ఇ.డి, సిబిఐ, ఐ.టి వేధింపులపై కేసు వేసే కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో మాత్రం మరింత గట్టిగా దర్యాప్తు చేయలేదేమని ఆక్షేపిస్తుంటారు. బిఆర్‌ఎస్, బిజెపి ఒకటేనని తిట్టిపోస్తుంటారు. మరో వంక బిఆర్‌ఎస్ కూడా కాంగ్రెస్, బిజెపి ఒకటేనంటే...బిజెపి ఈ ఇద్దరూ ఒకటేనంటుంది. ఇదంతా ఒక ప్రహసనం. రాజకీయ అవకాశవాదం. ఇవన్నీ తాము చేస్తూ సిపిఎం, వామపక్షాలపై ఎదురు దాడి చేస్తుంటారు. బిజెపిని గురించి తర్వాత మాట్లాడవచ్చు, రాష్ట్ర సర్కార్లపై ముందు యుద్ధం చేయాలని చిందులేస్తుంటారు. ఇందులో చేతులు కలపకుండా బిఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడమేమిటని తిట్టిపోస్తుంటారు. మునుగోడులో వామపక్షాల మద్దతు కారణంగానే బిఆర్‌ఎస్ గట్టెక్కడంతో ఇలాంటి వారి కోపం మరీ శ్రుతిమించినట్టు కనిపిస్తుంది. కమ్యూనిస్టులేదో పొత్తుల కోసం, సీట్ల కోసం పాకులాడుతున్నట్టు వ్యతిరేకులతో కలిసి ఆరోపిస్తుంటారు. మన మీడియా మొత్తం ఈ గాడిలోనే సంచరిస్తుంటుంది గనక షరా మామూలుగా కమ్యూనిస్టులను ఆపహాస్యం చేసేందుకు ఆరాటపడుతుంటుంది. ఈ ఒక్కుమ్మడి దాడితో ఉద్యమాభిమానులలోనూ కొన్నిసార్లు తికమక సృష్టిస్తారు.

రాష్ట్రాలు, దేశం వేర్వేరా?

ఎ.పి, తెలంగాణ రాజకీయాలు దేశ రాజకీయాలలో భాగం తప్ప విడిగా వుండవు. ఆ రాజకీయాలను నిశితంగానూ జాగ్రత్తగానూ పరిశీలించేవారెవరికైనా బిజెపి పాలన ఎంత ప్రమాదకరంగా తయారైందో తెలుస్తుంది. రాష్ట్రాలను దిష్టిబొమ్మలుగా మార్చి రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కి బిజెపి, మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ నిరంకుశాధికారం చలాయిస్తున్న తీరు గతంలో ఎరగం. ఇందిరాగాంధీ ఎమర్జన్సీ నాటికంటే ఈ అప్రకటిత ఎమర్జన్సీ భయంకరంగా సాగుతున్నది. నేను తల్చుకుంటే మీ ప్రభుత్వం వుండేదా అని తెలంగాణ గవర్నర్ తమిళిసై కెసిఆర్‌ను ప్రశ్నిస్తారు. అనేక బిల్లులపై సంతకం చేయకుండా ప్రతిష్టంభన సృష్టిస్తే ఆ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. అక్కడ ఏవో అంగీకరించినట్టు చెప్పి మళ్లీ షరామామూలే! ఎ.పి కి ప్రత్యేక హోదా నిరాకరణ పోలవరం నిధుల బిగింపు రాజధానికి సహాయ నిరాకరణ, రెవెన్యూ లోటు భర్తీకి తిరస్కరణ అన్నీ ఈ పరంపరలోవే. రాజకీయంగా జగన్ సర్కారు ఎంతగా లోబడి వ్యవహరిస్తున్నా మోడీ సర్కారు తీరులో మార్పు లేనే లేదు. గతంలో కెసిఆర్ కూడా చాలా సానుకూలంగా వుండేవారు. దాని వల్ల చీమంత ప్రయోజనం లేదని తెలిశాకే వ్యతిరేక వైఖరి తీసుకున్నట్టుంది. ఆ మాటకొస్తే చంద్రబాబు నాయుడు కూడా 2014-18 మధ్య మోడీ ప్రభుత్వంలో వుండి వారినీ చేర్చుకుని ఆ తర్వాతే ఎన్నికల సమయంలో అడ్డం తిరిగారు. తమాషా ఏమంటే 2019 ఎన్నికల్లో అధిక సీట్లతో గెలిచాక మోడీ నిరంకుశత్వం పెరిగిందే గానీ తగ్గలేదు. చంద్రబాబు మాత్రం అనుకూల వైఖరి ఎత్తుకున్నారు. పవన్ కళ్యాణ్ కూడా 2018-19లో మోడీపై నిప్పులు చెరిగారు. తర్వాత చల్లగా ఆ పక్షానే చేరారు. ఓట్ల చీలిక నివారించాలంటూ బిజెపిని ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. జగన్‌కు వ్యతిరేకత పేరిట బిజెపి, టిడిపి, జనసేన కలవాలనేదే ఈ శిబిరంలో ప్రధాన కాంక్షగా వుంది. తెలంగాణలో కెసిఆర్ కుటుంబ పాలన తప్ప బిజెపి సమస్య కాదన్నట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తుంది.

కమ్యూనిస్టులకేదో సైద్ధాంతిక చాదస్తం పట్టి బిజెపిని ప్రథమ రాజకీయ ప్రమాదంగా పరిగణిస్తున్నారని వాదించే వారిలో ఈ పార్టీల వారేగాక ఇతరులు కూడా వుంటారు. మొదటే అన్నట్టు ఒక జాతీయ కోణం మితవాద, మతవాద రాజకీయాల ముప్పు వీరికి తెలియదా? ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు, న్యాయ వ్యవస్థ, ప్రతిపక్షాల పాత్ర, విద్యారంగం, చరిత్ర, సైన్సు, ప్రజాస్వామ్యం, లౌకిక భావన, రాష్ట్రాల హక్కులు, పార్లమెంటు చర్చలు, దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వ రంగం, మహిళల హక్కులు, మత స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ, సినిమాల సెన్సార్, కార్మిక ఉద్యోగ హక్కులు వంటి ప్రతి ప్రజాస్వామిక విలువకూ చట్టాలకూ శిలువ వేస్తున్న మోడీ సర్కారును ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్యం ఏమవుతుంది? ఆఖరుకు డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి మహాత్మా గాంధీ హంతకుణ్ని కూడా దేశ భక్తునిగా చిత్రించిన తర్వాత ఈ దేశ ఘన వారసత్వం ఏమవుతుంది? ఆర్థిక రంగంలోనూ పెద్ద నోట్ల రద్దు వంటి బాధ్యతా రహిత నిర్ణయాలు చేసి మరోవైపున రిజర్వుబ్యాంకు నుంచి అదనపు నిల్వలు ఖాళీ చేస్తున్న వైనాన్ని విస్మరిద్దామా? సామాన్యుల పన్నులను పెంచి వసూళ్లు బిగించి బడా సంపన్నులను కాపాడటం, అదానీ వంటి కళంకిత కుబేరులకు సమస్తం కట్టబెట్టడమే గాక విదేశాలకు అనధికార రాయబారులుగా పంపడం మర్చిపోదామా? కమ్యూనిస్టులు బిజెపి పాలనపై పోరాడాలని చెప్పడంలో కొన్ని కఠోర వాస్తవాలివి.

మారణహోమంలో అవకాశవాదమా?

రాష్ట్రాల్లో అధికారంకోసం ఏవైనా పార్టీలు జాతీయ ఉపద్రవం వంటి మత రాజకీయాలను కార్పొరేట్ విధాన విన్యాసాలను విస్మరించవచ్చు గాని వామపక్షాలు ఆ పని చేయవు. దేశంలో ఒకమేరకైనా మతతత్వ కేంద్రీకృత పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యత పెరుగుతుంటే తెలుగునాట ప్రాంతీయ పక్షాలూ కాంగ్రెస్ కూడా ఆ విషయంలో ఉదాసీనత వహించడం దురదృష్టకరం. ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కుదిరేది, లేనిది అంతిమంగా తేలుతుంది. బిజెపిపై పోరాటం మాత్రం ప్రథమ కర్తవ్యం. ఇక ఎ.పి లోనూ ఎవరితో కలిసి పనిచేయాలి? ఎన్నికల పోరాటం ఎలా చేయాలి? అనేది ఈ అంశంపైనే ఆధారపడి వుంటుంది. బిజెపితో ఏ మాత్రం సంబంధం వున్నా తాము ఆమోదించేది వుండదని సిపిఎం ఇప్పటికే స్పష్టం చేసింది.

ఉన్నావోలో గతంలో యువతిపై ఘోర అత్యాచారం ఒకటైతే జైలు నుంచి బెయిలుపై వచ్చిన బిజెపి వర్గీయులు ఆమె ఇంటిని తగలబెట్టి పసికందును, భర్తను బలిగొనడం తాజా ఘట్టం. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై పైశాచికంగా అత్యాచారం చేసిన వారికి స్వేచ్ఛ ప్రసాదించిన కేంద్రం, గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం గగుర్పాటు కలిగిస్తుంది. ఇతర మతస్తులపై విద్వేషం రగిలించడమే పనిగా పెట్టుకున్నవారు భిన్న మత నిలయంగా బహుళ సంస్కృతికి ఆటపట్టయిన ఈ దేశానికి ఎంతటి ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నారు? హైదరాబాదులో ఈ క్షణంలో కూడా సర్జికల్ స్ట్రయిక్స్ గురించి బెదిరించడం చూడలేదా? రాష్ట్ర ప్రభుత్వాల తప్పులపై హానికర నిర్ణయాలపై పోరాడవలసిందే. కానీ ఆ పేరిట బిజెపితో జత కట్టడం దేశానికే చేటు. కనుక బిజెపిపై పోరాటం ఏదో రాజకీయ ఎత్తుగడ కాదు, భారతీయుల రాజ్యాంగ విహిత కర్తవ్యం. దీన్ని వక్రంగా చిత్రించడం లేదా తక్కువ చేసి చూపడం బాధ్యతా రహితం. దురుద్దేశ పూరితం.

ప్రతిపక్షాల ఐక్యతకు సార్థకత చేకూరాలంటే...

ఐక్య ఉద్యమాలే శరణ్యం

వ్యాఖ్య

ఈ మధ్య ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎక్కువగా మాట్లాడుకోవడం వినిపిస్తోంది. వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు సమావేశాల మీద సమావేశాలు జరుపుతుండడంతో ఈ చర్చ మరింత ఊపందుకుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ అర్థభాగంలో 18 ప్రతిపక్ష పార్టీలు ప్రదర్శించిన ఐక్య వైఖరి నేపథ్యంలో ఈ అంశం ముందుకొచ్చింది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె.పి.సి) వేయాలని ఆ పార్టీలన్నీ డిమాండ్ చేశాయి. అలాగే, ప్రతిపక్ష నేతలను ఇ.డి, సిబిఐ లక్ష్యంగా చేసుకోవడాన్ని కూడా అవి సమైక్యంగా వ్యతిరేకించాయి.

క్రిమినల్ పరువునష్టం కేసులో సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి శిక్ష విధించడం, ఆ వెంటనే రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేసినప్పుడు ఐక్యంగా వ్యవహరించాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నేతల అరెస్టు, విచారణ చూశాక, నిరంకుశ ప్రభుత్వం నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం మనుగడ కోసం సాగే పోరాటంగా చాలామంది గుర్తించారు.

అయితే ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తేవాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు అనుసరించిన మార్గం, వివిధ రాజకీయ వ్యాఖ్యాతలు, మీడియా ఈ విషయమై చేస్తున్న ఊహాగానాలు చూస్తుంటే...దీని గురించి వాటికి స్పష్టమైన ఆలోచన కొరవడిందని, అవాస్తవిక అంచనాలతో వున్నాయని అర్థమవుతోంది.

అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు ఒకే వేదికపైకి వస్తే అది అఖిల భారత ప్రతిపక్ష పార్టీల కూటమి ఏర్పాటుకు ఆలంబనగా వుంటుందని చెప్పడం చాలా తేలికైన భావన. జాతీయ స్థాయిలో ప్రతిపక్షం తరపున బరిలో నిలిచే నేత ఎవరనే దాని గురించి చర్చించడం మరో వ్యర్థ ప్రయత్నం. రాష్ట్రంలోని అత్యంత బలమైన ప్రతిపక్ష పార్టీ...అది ప్రాంతీయ పార్టీ అయినా లేదా జాతీయ పార్టీ అయినా సరే... బిజెపి, దాని మిత్రపక్షాలతో ముఖాముఖి పోటీ పడగలిగేలా ఇతర పార్టీలతో అవగాహనకు అవసరమైన షరతులు, నిబంధనలను రూపొందించుకోవడానికి లేదా నిర్దేశించడానికి అనుమతించాలనేది ఈ చర్చలో వచ్చిన మరో ముఖ్యమైన అంశం.

ఈ సూచనలన్నీ క్షేత్ర స్థాయిలో వాస్తవికతకు దూరంగా వున్నవే. ప్రతిపక్ష పార్టీల భిన్నమైన స్వభావాలు, సంక్లిష్టతలను ఇవి ఏమాత్రం పరిగణనలోకి తీసుకున్నట్టుగా లేదు.

మొట్టమొదట స్పష్టం చేయాల్సిన అంశం ఏమిటంటే అన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలతో కూడిన కూటమి లేదా ఫ్రంట్ రూపంలో ప్రతిపక్షాల ఐక్యతను జాతీయ స్థాయిలో రూపొందించలేమని అర్థంచేసుకోవాలి. బిజెపికి వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖాముఖి పోటీ వుండేలా చూడడం ద్వారా బిజెపి పై విజయం సాధించవచ్చనేది మరో భావన. సంకుచిత ఎన్నికల దృక్పథం నుండి వచ్చిన తప్పుడు ఆలోచన ఇది.

ప్రజాస్వామ్యంపై మూకుమ్మడి దాడి, రాజ్యాంగ విధ్వంసం, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, రాష్ట్రాల హక్కులు, సమాఖ్యవాదంపై వ్యవస్థాగతమైన దాడి, హిందూత్వ సిద్ధాంతాలను విద్యా రంగంలోకి చొప్పించడం, మైనారిటీలపై దాడులు వంటి ప్రధానమైన జాతీయ, కీలకమైన రాజకీయ అంశాలపై తీసుకునే ఉమ్మడి వైఖరే ప్రతిపక్షాల ఐక్యతకు ముఖ్య ప్రాతిపదిక అని గ్రహించాలి.

దేశ భవిష్యత్‌కు సంబంధించి కీలకమైన, ప్రాథమికమైన అంశాలు ఇవి. హిందూత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం కోసం పోరాడేందుకు వారు ఎంతవరకు ఐక్యంగా కలిసి వస్తారనేది ప్రతిపక్షాల ఐక్యతకు ఒక పరీక్షగా నిల్చింది. వీటితో పాటు ప్రధానిని, ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసే అనేక కీలకాంశాలు వున్నాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై పార్లమెంట్‌లో అన్ని రకాల చర్చలకు అడ్డుగోడగా మోడీ ప్రభుత్వం నిలవడం, పార్లమెంట్‌లో మోడీ చేసిన ప్రసంగంలో అదానీ పేరును కనీసం ప్రస్తావించకపోవడం ఈ మొత్తం వ్యవహారం మీద సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయడానికి తిరస్కరించిన తీరు ఇవన్నీ కలిసి పార్లమెంట్‌లో ప్రతిపక్షాల విస్తృత ఐక్యతకు దోహదపడ్డాయి. పార్లమెంట్ వెలుపల కూడా ఇదే ఐక్యత కొనసాగాలి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

అదానీ అసాధారణంగా ఎదిగిన తీరుపై ప్రధానిని జవాబుదారీ చేయడం, పుల్వామా దాడికి సంబంధించి జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వెల్లడించిన అంశాలపై జవాబు రాబట్టేలా చూడడం వంటివన్నీ ప్రతిపక్షాలను ఏకం చేసే అంశాలే. అదే సమయంలో, రాష్ట్రాల హక్కులపై, సమాఖ్యవాదంపై కేంద్రం దాడిని సమైక్యంగా తిప్పికొట్టేందుకు బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు కనీసం ఒక్కసారైనా సమావేశం కాకపోవడం మొత్తం ప్రతిపక్ష పార్టీల ఆలోచనా ధోరణిలో సమగ్రత కొరవడిన విషయాన్ని తెలియచేస్తోంది.

అన్ని కీలకమైన విధానపరమైన అంశాలపై తమ ప్రత్యామ్నాయ వైఖరిని ప్రతిపక్షాలు ముందుకు తేగలిగితే, ప్రజాస్వామ్యం లౌకికవాదం, సమాఖ్యవాదం వంటి వాటి పరిరక్షణకు అవి గట్టిగా నిలబడగలిగితే, అది, సమైక్య ప్రత్యామ్నాయాన్ని సాధించే దిశగా వేసిన ఒక ముందడుగుగా భావించవచ్చు. ప్రజా సమస్యల పైన అలాగే ప్రజల జీవనోపాధుల పైన నిరంతరం సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా ఉమ్మడి ప్రచారాలు, నిరసనలకు పిలుపు ఇవ్వడం వంటివి చేయాలి.

ఇటువంటి పిలుపులను పలు పార్టీలు కలిసి ఉమ్మడి వేదికల ద్వారాగాని, ఐక్య కార్యాచరణ ద్వారాగాని చేయాలి. ఇది సాధ్యం కాని రాష్ట్రాల్లో సంబంధిత పార్టీలు సమాంతర కార్యాచరణ ద్వారా విడిగా నిర్వహించుకోవచ్చు. జాతీయ స్థాయిలో ఉమ్మడిగా పిలుపునిచ్చినా, కొన్ని రాష్ట్రాల్లో అది అమలు చేయలేని పరిస్థితుల్లో కొన్ని పార్టీలు వున్నందున ముందుకెళ్లాల్సిన వాస్తవిక మార్గమిదే.

బిజెపి వ్యతిరేక ఓట్లను గరిష్ట స్థాయిలో సమీకరించేందుకు రాష్ట్ర స్థాయిలో ఎన్నికల ఎత్తుగడలను రూపొందించుకునేందుకు అనువైన పరిస్థితిని కల్పించే సూచనలే ఇవన్నీ. ప్రస్తుతానికి, బిజెపి, దాని కూటమిపై పోరాడేందుకు విస్తృత అవగాహన కుదిరిన రాష్ట్రాలు రెండే రెండు వున్నాయి. అవే తమిళనాడు, బీహార్.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం వంటి కీలకాంశాలపై ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి వైఖరిని తీసుకోగలిగితే, ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టగలిగితే, మొత్తం ప్రతిపక్షం విశ్వసనీయత పెరుగుతుంది. అప్పుడు ప్రజలు వాటిని బిజెపికి ప్రత్యామ్నాయంగా భావించడం మొదలుపెడతారు. లోక్‌సభ ఎన్నికలు జరిగినపుడు, ఈ ఐక్యతా చొరవలన్నీ ప్రతిపక్ష పార్టీలకు (అవి ఎన్నికల్లో పొత్తు పెట్టుకోనప్పటికీ) ఏదోఒక విధంగా ఉపయోగపడతాయి.

అందువల్ల అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒకేచోటకు చేర్చేందుకు ప్రస్తుతం జరుగుతున్న యత్నాలు ఒక స్పష్టమైన డైరెక్షన్‌లో ముందుకు సాగేలా చూడడం అత్యంత కీలకం. ముఖ్యమైన జాతీయ సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయంతో ఐక్యంగా ముందుకు కదలడం, రాష్ట్రాలలో బిజెపి పై పోరుకు ప్రజలను సమీకరించి వీలైన చోటల్లా ఐక్య కార్యాచరణకు పూనుకోవడం, బిజెపి వ్యతిరేక ఓట్లను గరిష్ట స్థాయిలో ఒకేచోట చేర్చడం వంటివి చేసినప్పుడే ఆ ఐక్యతా యత్నాలకు సార్థకత.

/'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం/

జనవాక్యం

పాన్, ఆధార్ లింకు సామాన్యుడికి భారం

పాన్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేయించుకోవడం ఆలస్యమైతే కేంద్ర ప్రభుత్వం జరిమానా విధించడం న్యాయం కాదు. సామాన్యులకు భారం అవుతుంది. పాన్ కార్డు అంటేనే సామాన్యులలో అత్యధికులకు తెలియదు. పాన్‌కార్డు ఆధార్‌కు లింకు చేయకపోతే జులై నుంచి తమ బ్యాంకు ఖాతా రద్దవుతుందని ఇంకా చాలా మందికి తెలియదు. ఇన్‌కమ్ టాక్సు పరిధిలోకి రాని వారికి పాన్‌కు, ఆధార లింకు ఎందుకని పేద, మధ్యతరగతి వారు ప్రశ్నిస్తున్నారు. నమోదు చేయడానికి వంద, రెండు వందల రూపాయలు మీసేవా కేంద్రాలలో తీసుకుంటున్నారు. ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి లింకు చేయించు కోకపోతే జరిమానా వేసినా ఒక అర్థం ఉంటుంది. సరైన ప్రచారం చేయకుండా వేయి రూపాయలు జరిమానా వేయడం సరైనదేనని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అనడం బాధాకరం. జీరో అకౌంటు వల్ల, డ్వాక్రా గ్రూపుల వల్ల ప్రతి కుటుంబంలోను కనీసం రెండు బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. దీంతో ప్రతి సామాన్య కుటుంబానికి రూ.2200 నుంచి రూ.2400 వరకు ఖర్చు అవుతుంది. పెరిగిన ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ప్రస్తుతం తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మరల జరిమానా భారం సామాన్యులను మరింత కుంగదీస్తుంది. సామాన్యుని పాన్ ఆధార్ లింకు రద్దు చేయాలి. లేదా జరిమానా రద్దు చేయాలి. ఈ విషయంపై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వాలు ఒత్తిడి తీసుకురావాలి.

- బి.బి. రామకృష్ణారావు,
సామర్లకోట, కాకినాడ జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఇంటి తాళాలను అధికారులకు అందజేస్తున్న రాహుల్

ఢిల్లీలోని అధికారిక బంగ్లాను ఖాళీ చేసిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడిన కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీలో తన అధికార నివాసాన్ని శనివారం ఖాళీ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ బంగ్లాలో రాహుల్ 2005 నుండి ఉంటున్నారు. ఇటీవల రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పార్లమెంట్ రద్దు చేసిన సంగతి తెలిసిందే. బిజెపి ఎంపి సిఆర్ పాటిల్ నేతృత్వంలోని లోక్‌సభ హౌసింగ్ కమిటీ .. ఈ నెల 22లోగా భవనాన్ని ఖాళీ చేయాల్సిందిగా రాహుల్ గాంధీకి లేఖ పంపిన సంగతి తెలిసిందే. దీంతో 12 తుగ్లక్ లేన్ బంగ్లాను రాహుల్ నేడు ఖాళీ చేశారు. మోడీ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. వాస్తవానికి పరువునష్టం కేసులో గుజరాత్ కోర్టు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు రాహుల్‌కు 30 రోజుల గడువు ఇచ్చింది. అయితే శుక్రవారం ఆయన సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించినా.. అక్కడ ఊరట లభించలేదు. సూరత్ కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ.. ఇప్పుడు రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది.

వారి రాజకీయం... ఉగ్రవాదులకు ఊతం

- పూంచ్ ఘటనపై 'సామ్నా'

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కర్ణాటక ఎన్నికల రాజకీయాలలో మునిగి తేలుతుంటే ఉగ్రవాదులు దానిని అవకాశంగా తీసుకొని జమ్ముకాశ్మీర్‌లో దాడికి తెగబడ్డారని శివసేన (ఠాక్రే గ్రూప్) తన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో విమర్శించింది. పుల్వామా ఘటన తర్వాత ఇదే ఘోరమైన ఉగ్రవాద దాడి అని అభివర్ణించింది. పూంచ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్ దళానికి చెందిన ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటికీ కాశ్మీర్ లోయలో హింస కొనసాగుతోందని, శాంతి నెలకొనలేదని 'సామ్నా' తెలిపింది. కేంద్ర సంస్థలు మోడీ-షా ద్వయం చేతిలో ఆయుధాలుగా మారాయని, ఉగ్రవాదులు వాటిని చూసి ఏ మాత్రం భయపడడం లేదని విమర్శించింది.

అయోధ్యలో ఘోర ప్రమాదం

- ట్రక్కు-బస్సు ఢీకొని ఏడుగురు మృతి

అయోధ్య : అయోధ్యలో ఘోర ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో లక్నో-గోరఖ్ పూర్ హైవే పై ట్రక్కు, బస్సు ఒకదానికొకటి ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందారు. మరో 40మందికిపైగా తీవ్రగాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనలో బస్సు నుజ్జునుజ్జవ్వడంతో గాయపడినవారిని బస్సు నుంచి బయటకు తీసేందుకు సహాయక సిబ్బందికి కష్టతరంగా మారింది. క్షతగాత్రులను అంబులెన్స్‌ల సహాయంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయోధ్య చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజయ్ మాట్లాడుతూ ... లక్నో-గోరఖ్ పూర్ హైవే పై ట్రక్కు వస్తున్న క్రమంలో ప్రైవేట్ బస్సు అంబేద్కర్ నగర్ వైపు వెళ్లేందుకు హైవేపై టర్న్ తీసుకుంటుండగా... ఎదురుగా వస్తున్న లారీని బస్సు ఢీకొట్టిందని తెలిపారు. ఈ ఘోర ప్రమాదంపై యుపి సిఎం ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దేశాన్ని విభజించేందుకు కుట్ర

- బిజెపిపై మమతా బెనర్జీ ఫైర్

కొల్‌కతా : విద్వేషపూరిత రాజకీయాలతో కొందరు దేశాన్ని విభజించేందుకు కుట్రపన్నుతున్నారని పశ్చిమబెంగాల్

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా శనివారం కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లోని మసీదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఏకం కావాలని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో మితవాద బిజెపి పార్టీని గద్దెదించాలని అన్నారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తోందన్నారు. అందుకే దేశంలో ఎన్‌ఆర్‌సిని ప్రవేశపెట్టారని .. కానీ పశ్చిమబెంగాల్‌లో ఎన్‌ఆర్‌సి అమలును తాను అనుమతించబోనని స్పష్టం చేశారు. దేశాన్ని విభజించాలని కోరుకుంటున్నవారికి.. ఈద్ సందర్భంగా ప్రామిస్ చేస్తున్నానని.. ఈ దేశం కోసం ప్రాణాలు ఇస్తానని.. కానీ దేశాన్ని విభజన కానివ్వన్నారు. ప్రస్తుతం చరిత్రను మార్చేశారని, రాజ్యాంగాన్ని కూడా మార్చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విభజన శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమై పోరాడాల్సిన అవసరముందని ఆమె అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైతే.. ప్రజలంతా విఫలమైనట్లేనని హెచ్చరించారు..

నిర్బంధంలో సత్యపాల్ మాలిక్ !

- 25 మంది రైతు సంఘాల నేతలు కూడా
- మాలిక్ మద్దతుదారుల ఆందోళన



రైతు సంఘాల నాయకులతో ఆర్‌కె పురం పోలీసు స్టేషన్ ఆవరణలో సత్యపాల్ మాలిక్

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో పాటు ఆయనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సుమారు 25 మంది రైతు సంఘాల నేతలను ఢిల్లీ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. రైతు సంఘాల నేతలతో పాటు మాలిక్ కూడా ఆర్‌కె పురం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దృశ్యాలను వివిధ వార్తా ఛానెళ్లు ప్రసారం చేశాయి. దీంతో సత్యపాల్‌ను తాము నిర్బంధించలేదని పోలీసులు వెల్లడించారు.

అంతకుముందు హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన సుమారు 250 నుండి 300 మంది మద్దతుదారులతో పలువురు రైతు సంఘాల నేతలు మధ్యాహ్నం 12.30కి ఢిల్లీలోని మాలిక్ నివాసానికి చేరుకున్నారు. మాలిక్ తమను విందుకు ఆహ్వానించారని, అందుకే అక్కడికి చేరుకున్నామని వారు పేర్కొన్నారు. మాలిక్ తన ఇంటికి సమీపంలోని పార్క్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే నివాస ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదంటూ వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మాలిక్ మద్దతుదారులు తెలిపారు. మాలిక్, రైతు సంఘాల నేతలను విడుదల చేస్తేనే తాము స్టేషన్ వదిలి వెళతామని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో రైతు సంఘాల నేతలందరినీ విడుదల చేశారు.

పుల్వామా ఉగ్రవాద ఘటనలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వైఫల్యాలపై నోరు విప్పవద్దంటూ ప్రధాని నరేంద్ర మోడీ తనకు చెప్పారని సత్యపాల్ మాలిక్ ఇటీవల మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రిలయన్స్ ఇన్సూరెన్స్ అంశంపై మాలిక్‌పై సిబిఐ దాడికి దిగిన సంగతి తెలిసిందే. బిజెపి నేత అయిన మాలిక్ జమ్ముకాశ్మీర్ సహా నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. జమ్ముకాశ్మీర్‌లో బీమా పథకాన్ని ప్రారంభించేందుకు రిలయన్స్ ఇన్సూరెన్స్‌కు తాను మొదట అనుమతిని నిరాకరించానని సత్యపాల్ మాలిక్ మీడియాకు వివరించారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేత రామ్ మాధవ్ తనపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆయన చెప్పారు.

కాగా ది వైర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుల్వామా ఎన్‌కౌంటర్ గురించి వెల్లడించిన అంశాల ప్రభావంతోనే తాము సత్యపాల్ మాలిక్‌ను ప్రశ్నించనున్నట్లు సిబిఐ తెలిపింది. ఈ నెల 28న ఆయనను సిబిఐ విచారించనుంది.

నన్ను భయపెట్టలేరు ! : సత్యపాల్

తనను ఏ రకంగానైనా భయపెట్టాలని ప్రభుత్వం పన్నే ఎత్తుగడలేవీ పనిచేయబోవని సత్యపాల్ మాలిక్ వ్యాఖ్యానించారు. 'నా అనుకునే వాళ్ళు నాతోనే వున్నారు. మీ పప్పులుడకవు' అని ఆయన కేంద్రంలోని మోడీ సర్కార్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. మాలిక్ నివాసం వెలుపల అంతకుముందు అరెస్టు చేసిన 20 నుండి 25 మంది ఖాప్ నేతలను ఢిల్లీ పోలీసులు విడుదల చేసిన అనంతరం మాలిక్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఇంట్లో భోజనానికి రావాల్సిందిగా ఆ వచ్చిన వారిని కోరానని, అయితే ఇంట్లో అంత స్థలం లేకపోవడంతో తినడానికి పార్క్‌కు వారితో కలిసి వెళ్ళానని పోలీసులకు తెలిపినట్లు మాలిక్ విలేకర్లకు చెప్పారు. తామంతా స్వచ్ఛందంగానే అరెస్టయినట్లు మాలిక్ తెలిపారు. అయితే మాలిక్‌ను అరెస్టు చేయలేదని ఢిల్లీ పోలీసులు ట్వీట్ చేశారు. రాబోయే కొద్ది రోజుల్లో తాను వివిధ రాష్ట్రాలకు వెళ్ళి ప్రజలను కలవనున్నట్లు చెప్పారు.

అవినీతికి కేరాఫ్ బిజెపి

- ప్రధాని మోడీ ఏం చేశారు?
- డికె శివకుమార్ విమర్శలు

బెంగళూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పైనా, కర్ణాటకలో బిజెపి పాలనపైనా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డికె శివకుమార్ నిప్పులు చెరిగారు. బిజెపి స్వపక్ష నేతలనూ అవమానాలకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడియూరప్పను సైతం ఆ పార్టీ వేధిస్తోందన్నారు. కర్ణాటకలో బిజెపి పాలన మొత్తం అవినీతిలో కూరుకుపోయిందన్నా విమర్శించారు. ఇంత జరుగుతున్నా..ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏం చేశారనీ? నిలదీశారు. ప్రధాని కేవలం ప్రసంగాలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతిని ఆయన ఆపలేదన్నారు. లింగాయత్ సామాజిక తరగతి ప్రజలను బిజెపి బెదిరింపులకు గురి చేస్తోందని, వారికి న్యాయం జరగడం లేదన్నారు. ఈ దఫా ఎన్నికల్లో తమ పార్టీకి లింగాయత్‌ల నుంచి విశేష మద్దతు లభిస్తోందని శివకుమార్ తెలిపారు. రాష్ట్రంలో 140 స్థానాల్లో కాంగ్రెస్ విజయపతాక ఎగురవేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవి రేసులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పేరు ప్రస్తావనకు రావడంపైనా శివకుమార్ స్పందించారు. ఎన్నికల తర్వాతే సిఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఖర్గే బ్లాక్ లీడర్ స్థాయి నుంచి కాంగ్రెస్ అధినేత స్థాయి వరకూ ఎదిగిన నేత అని, ఆయనకు 51 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, ఆయనే సిఎం కావచ్చు అని, దానిని ఎవ్వరూ కాదనలేరని శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమూల్ ప్రవేశాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకార వ్యవస్థను నాశనం చేసి, కార్పొరేటీకరణ దిశగా పాడి పరిశ్రమను నెట్టేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

జెడిఎస్ సమావేశానికి హాజరైన రైతులు

డాక్టర్ అనిల్‌ని గెలిపించుకుందాం

- జెడిఎస్ రైతు సంఘం పిలుపు

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బాగేపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి, ప్రజా వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్‌ను గెలిపించుకుందామని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ అనుబంధ రైతు సంఘం పిలుపునిచ్చింది. జెడిఎస్, రాష్ట్ర రైతు సంఘాల ముఖ్య నాయకులు ఈ మేరకు శనివారం నాడు గుడిబండ పట్టణంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి జెడిఎస్, సిపిఎం కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బాగేపల్లిలో సిపిఎం విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని ముక్తకంఠంతో తీర్మానించారు.

అమెరికాలో పెరగనున్న కార్పొరేట్ రుణాల ఎగవేతలు, మాంద్యం

న్యూయార్క్ : వచ్చే ఏడాది కాలంలో అమెరికాలో కార్పొరేట్ రుణాల ఎగవేతలు, మాంద్యం మరింతగా పెరగొచ్చని క్రెడిట్ పోర్టుఫోలియో మేనేజర్లు అంచనా వేస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది మాంద్యంలోకి ప్రవేశించవచ్చని 84శాతం మంది భావిస్తున్నారు. క్రెడిట్ పోర్టుఫోలియో మేనేజర్ల అంతర్జాతీయ సమాఖ్య నిర్వహించిన త్రైమాసిక పోల్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. రాబోయే 12 మాసాల్లో రుణాల చెల్లింపుల ఎగవేతలు పెరుగుతాయని 81శాతం మంది ఫండ్ మేనేజర్లు విశ్వసిస్తున్నారు. బ్యాంకుల లిక్విడిటీ తగ్గిపోవడం, సూక్ష్మ ఆర్థికాంశాలపై క్రెడిట్ రిస్క్ పట్ల ఆందోళనలు ఇందుకు కారణమని పేర్కొంది. నార్త్ అమెరికన్ కంపెనీలకు సంబంధించి అమెరికాలో రుణాల ఎగవేతలు పెరుగుతాయని 86శాతం మంది భావిస్తే, యూరప్‌లో పెరుగుతాయని 91శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఏదో ఒక సమయంలో మాంద్యం నెలకొంటుందని 84శాతం మంది భావిస్తుండగా,

ఆ పరిస్థితి యూరప్‌లోనో లేదా బ్రిటన్‌లోనో వుంటుందని 61శాతం మంది పేర్కొంటున్నారు. రాబోయే మూడు మాసాల్లో నార్త్ అమెరికన్ కంపెనీల రుణాలు దాదాపు 60శాతం పెరుగుతాయని భావిస్తున్నారు.

సిలికాన్ కేంపస్ ప్రాజెక్టును నిలిపివేసిన గూగుల్

సిలికాన్ వ్యాలీ నగరమైన శాన్‌జోస్‌లో పెద్ద కేంపస్ నిర్మాణాన్ని గూగుల్ నిలిపివేసింది. వ్యయాన్ని కుదించుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు సిఎన్‌బిసి తెలిపింది. అంతర్జాతీయంగా 12వేల ఉద్యోగాల్లో కోత విధిస్తున్నట్లు ఈ ఏడాది ప్రారంభంలో గూగుల్ మాతృ కంపెనీ అల్ఫాబెట్ ప్రకటించింది.

సవాలుగా మారిన ఆర్థిక పరిస్థితులను ఇందుకు కారణాలుగా పేర్కొంది. గతేడాది చివరి మూడు మాసాల్లో ఆశించినంతగా ఆదాయం, లాభాలు లేవని ఆల్ఫాబెట్ తెలిపింది. కఠినమైన ఆర్థిక పరిస్థితులు తమ వ్యాపార వాణిజ్య అవకాశాలను దెబ్బతీశాయని తెలిపింది. డౌన్‌టౌన్ వెస్ట్ కేంపస్ నిర్మాణానికి అనుమతినిచ్చినప్పటికీ పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో వుంచుకుని ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును ఆపాలని భావించినట్లు సిఎన్‌బిసి నివేదిక తెలిపింది. అయితే తిరిగి దీన్ని ఎప్పుడు ప్రారంభించేది వంటి వివరాలు వెల్లడించలేదు. 32 హెక్టార్లలో ఆఫీసు కార్యాలయం, ఇళ్ళు, పబ్లిక్ పార్కులు నిర్మించాలన్నది గూగుల్ ఆలోచనగా వుంది.

అత్యంత వేగంగా కరుగుతున్న హిమనదాలు!

న్యూయార్క్ : ప్రపంచంలో హిమనదాలు గతేడాది గణనీయ వేగంతో కరిగిపోయాయని, ఆ వేగాన్ని అరికట్టడంలో, వాటిని కాపాడుకోవడంలో మనం విఫలమవుతున్నామని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. హిమ నదాలు కరగడాన్ని వాతావరణ మార్పులకు ప్రధాన సూచికగా పరిగణిస్తారు. గత 8ఏళ్ళు అత్యంత వేడిమిగానే వున్నాయని, మరోవైపు కార్బన్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారక వాయువులు వాతావరణంలో బాగా పేరుకుపోతున్నాయని ఐక్యరాజ్య సమితి ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. అంటార్కిటికా సముద్రంలో మంచు రికార్డు స్థాయిలో తక్కువగా నమోదైంది. కొన్ని యురోపియన్ హిమనదాలు కరిగిపోతూ మొత్తంగా కనుమరుగవుతున్నాయని తన వార్షిక వాతావరణ సమీక్షలో పేర్కొంది. సముద్ర మమాట్టాలు కూడా రికార్డు స్థాయిలో అధికంగా వున్నాయి. 2013-2022 మధ్య కాలంలో ఏడాదికి సగటున 4.62 మిల్లీమీటర్ల చొప్పున సముద్ర మట్టం పెరుగుతూ వచ్చాయి. 1993-2002 మధ్య కాలంలో పెరిగిన దానితో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపుగా వుంది. మహా సముద్రాల్లో కూడా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాలుష్య కారక వాయువుల వల్ల భూమిపై పెరిగే వేడిలో 90శాతాన్ని సముద్ర జలాలు గ్రహిస్తాయి.

ఒమిక్రాన్ సబ్ వేరియంట్ 'ఆసక్తి చూపాల్సిన' వేరియంట్ !

- డబ్ల్యుహెచ్ఓ ప్రకటన

న్యూఢిల్లీ : ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ఎక్స్‌బిబి.1.16ను 'ఆసక్తి చూపాల్సిన వేరియంట్' (విఓఐ)గా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రకటించింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌లో 12,193 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. గత 24గంటల్లో 42 మరణాలు సంభవించాయి. భారత్‌లో కూడా కేసులు పెరగడానికి ఈ వేరియంట్ కారణంగా వుంది. అమెరికాతో సహా 31 దేశాల నుండి ఈ వేరియంట్ కేసులు బాగా పెరుగుతున్నట్లు వార్తలందాయి. ఈ వేరియంట్‌ను మార్చిలో మహారాష్ట్రలో కనుగొన్నామని మరియా వాన్ ఖెర్కోవ్ తెలిపారు. డబ్ల్యుహెచ్ఓలో కోవిడ్ రెస్పాన్స్‌కు టెక్నికల్ హెడ్‌గా మరియా వ్యవహరిస్తున్నారు. ఈ వేరియంట్ రోగ నిరోధక శక్తి నుండి తప్పుకోగలుగుతోందని అన్నారు. అయితే తీవ్రతలో పెద్దగా మార్పులు వున్నట్లు సమాచారం లేనప్పటికీ పూర్తి స్థాయిలో వ్యాధులను కలిగించగల గుణం ఈ వేరియంట్‌కు వుందని, అందువల్లే అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని అన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం భారత్‌లో క్రియాశీలంగా వున్న కేసుల సంఖ్య 67,556కి చేరింది. కోవిడ్ కేసులు, మరణాలు పెరుగుతుండడంతో కోవిడ్ మహమ్మారి భయం ఇంకా ముగిసిపోలేదని, కేసుల వ్యాప్తిని అదుపు చేయడం కీలకమని పేర్కొంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి 8 రాష్ట్రాలకు లేఖలు రాశారు.

మతం పట్ల అమెరికన్లలో సడలుతున్న విశ్వాసం

- తాజా సర్వేలో వెల్లడి

న్యూయార్క్ : మతం అనేది తమకు చాలా ముఖ్యమని 2023 సంవత్సరంలో కేవలం 39శాతం మందే అభిప్రాయపడ్డారని ఒక సర్వేలో వెల్లడైంది. అదే 1998లో అయితే ఈ శాతం 62గా వుందని బుధవారం న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన ఈ సర్వే పేర్కొంది. చికాగో యూనివర్శిటీలో గత నెల్లో దాదాపు 1000మంది అమెరికన్లపై వాల్‌స్ట్రీట్ జర్నల్, ఎన్‌ఓఆర్‌సిలు సర్వే నిర్వహించాయి. మతం ప్రాముఖ్యతతో పాటూ వివిధ విలువలు అమెరికన్లకు ఎంత కీలకమైనవో ఈ సర్వేలో తెలుసుకునే యత్నం చేశారు. 1988 నుండి 2012 వరకు ప్రపంచ జనాభాలో కేవలం 2 నుండి 3 శాతం మందే నాస్తికులు వున్నారని ఎన్‌ఓఆర్‌సి డేటా పేర్కొంది. కానీ 2021 నాటికి ఈ సంఖ్య జనాభాలో 7శాతానికి పెరిగింది. తామెన్నడూ మతపరమైన కార్యక్రమాలకు హాజరు కాలేదని 1988లో 17శాతంమంది అమెరికన్లు చెప్పారు. 2021లో, ఆ సంఖ్య 31శాతానికి పెరిగింది. అమెరికాలో, ప్రతి ఏటా 6 నుండి 10వేల చర్చిలు దాకా మూత పడుతున్నాయి. వాటిని తిరిగి అపార్ట్‌మెంట్లుగా, లాండ్రీలుగా, స్కేటింగ్ పార్కులుగా మారుస్తున్నారు. లేదా మొత్తంగా కూలగొట్టేస్తున్నారని ఆ సర్వే పేర్కొంది.

సీనియర్ న్యాయవాది కె సుబ్బారావు కన్నుమూత

బెంగళూరు : ప్రఖ్యాత న్యాయవాది, శ్రమజీవుల పక్షపాతిగా పేరొందిన కె సుబ్బారావు (92) ఇకలేరు. బెంగళూరులోని ఆయన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సుబ్బారావుకు భార్య సుశీల రావు, కుమార్తె మాయారావు ఉన్నారు. ఆయన మృతి పట్ల సిఐటియు తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. దాదాపు 60 ఏళ్ల పాటు న్యాయవాది వృత్తిలో కొనసాగిన సుబ్బారావు కార్మికుల హక్కుల కోసం పోరాడారని పేర్కొంది. ఎన్ఎల్ ఉపాధ్యాయ, ఎస్ సూర్యనారాయణ రావు, ఎంఎస్ కృష్ణన్, ఎంసి నరసింహన్ తదితర స్వాతంత్ర సమరయోధులు, కార్మిక సంఘాల నాయకులు పక్షాన ఆయన వాదనలు వినిపించి జైలు నుంచి విడుదల చేయించారని తెలిపింది. దేశంలో అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ప్రజాతంత్ర హక్కుల కోసం సుబ్బారావు న్యాయ పోరాటం సాగించారు. అప్పట్లో అనేక మంది సామాజిక కార్యకర్తలను, కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేయగా.. హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్ల ద్వారా ప్రభుత్వ నిరంకుశత్వాన్ని సుబ్బారావు బహిర్గతం చేశారని గుర్తు చేసింది. ప్రభుత్వ రంగాల్లోనూ, అనేక ఇతర పరిశ్రమల్లోనూ పని చేస్తున్న కార్మికులకు న్యాయపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు సుబ్బారావు న్యాయసేవలందించారని కొనియాడింది. కేరళలో సిపిఎం ఆధ్వర్యంలో నడుస్తున్న ఇఎంఎస్ అధ్యయన కేంద్రానికి 2.3 ఎకరాల భూమిని సుబ్బారావు విరాళంగా అందజేశారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన సిఐటియు 17వ అఖిల భారత మహాసభ ఆహ్వానకమిటీకి గౌరవ అధ్యక్షులుగా కూడా సుబ్బారావు వ్యవహరించారు.

ఎన్‌పిఎస్‌లో చేరనందున రూ.1296.61 కోట్లు ఆదా

- తమిళనాడు అసెంబ్లీలో కాగ్ వెల్లడి

చెన్నయ్ : కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్న జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్)లో చేరనందున తమిళనాడు ప్రభుత్వం 2020-21లో రూ.1296.61 కోట్ల మేర అదనపు ఖర్చును నివారించగలిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శుక్రవారం నాడు ప్రవేశపెట్టిన నివేదికలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. ఎన్‌పిఎస్‌లో చేరకుండా ..తమిళనాడు ప్రభుత్వం 2003 ఏప్రిల్ 1 నుంచి డిఫైన్డ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (డిసిపిఎస్) పేరుతో ప్రత్యేక ఫించను పథకం అమల్జేస్తోందని కాగ్ పేర్కొంది. 2003 తర్వాత రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో చేరేవారందరికీ ఈ స్కీమ్ వర్తింస్తుంది. ఇందులో ఉద్యోగులు తమ బేసిక్ వేతనం, కరువు భత్యం (డిఎ) నుంచి 10 శాతం కాంట్రిబ్యూట్ చేస్తే, ప్రభుత్వం కూడా అంతే మొత్తం జత చేసి దానిని డిసిపిఎస్ ప్రజా పద్దుకు బదిలీ చేస్తారు. ప్రభుత్వ డేటా సెంటర్ (జిడిసి)లో ఉద్యోగుల డిసిపిఎస్ ఖాతాలను నిర్వహిస్తారు. ప్రతి యేటాది జిడిసి వడ్డీ గణించి ఆ మొత్తాన్ని ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తుంది. 2003 మార్చి 31 తర్వాత ఉద్యోగాల్లో చేరి రిటైరయిన వారికి పెన్షన్, ఇతర రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం 2022 మార్చ్‌తో ముగిసే సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.26,249.95 కోట్లు ఖర్చు చేసిందనీ, ఇది మొత్తం రెవెన్యూ ఖర్చులో 10.33 శాతమని కాగ్ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వం 2008-09లో జాతీయ ఫించను వ్యవస్థ (ఎన్‌పిఎస్), ఫించను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పిఎఫ్ఆర్‌డిఎ) ని ఏర్పాటు చేసి ఎన్ఎ ఎస్‌లో చేరాల్సిందిగా రాష్ట్రాలను కోరిన విషయం తెలిసిందే. అయితే తమిళనాడు ప్రభుత్వం ఎన్‌పిఎస్‌లో చేరబోమని 2010లో ప్రకటించింది. డిసిపిఎస్ అమల్లోకి వచ్చి 19 ఏళ్లు అయినా కూడా ఎన్‌పిఎస్‌లో చేరేందుకు రాష్ట్రం నిరాకరించిందని కాగ్ తెలిపింది. కాగా ఉద్యోగులు కోరుతున్నట్లుగా పాత పెన్షన్ పథకాన్ని అమల్జేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నియమించిన నిపుణుల కమిటీ నివేదిక అందజేసిందని, అది ప్రభుత్వ పరిశీలనలో ఉందని కాగ్ పేర్కొంది.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

బాలాఘాట్ : మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య శనివారం తెల్లవారుజామున ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన మావోయిస్టులను ఏరియా కమిటీ మెంబర్, భోరందేవ్ కమిటీ కమాండర్ అయిన సునీత, ఏరియా కమిటీ మెంబర్ సరితా ఖాటియా మోచాగా గుర్తించారు. వీరిపై రూ.14 లక్షల చొప్పున రివార్డు ఉన్నదని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో తుపాకులు, కాట్రిజ్‌లు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ఆశా కార్యకర్తలకు మొండిచేయి

లక్నో : గ్రామీణ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే ఆశా కార్యకర్తల విషయంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. గత నాలుగు నెలలుగా వారికి గౌరవ వేతనం లభించడం లేదు. నెలసరి స్టైఫండ్ రాకపోవడంతో ఆకలితో అల్లాడుతున్న తాము గ్రామీణులకు ఆరోగ్యాన్ని ఎలా అందించగలమని వారు ప్రశ్నిస్తున్నారు. ఆశా కార్యకర్తలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నెలకు రెండు వేల రూపాయల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తోంది. గర్భిణులకు ప్రసవాలు చేస్తే మరికొంత ప్రోత్సాహకం లభిస్తుంది. ఇంత చేసినా ఉపాధి హామీ కూలీల కంటే తక్కువే వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నెలకు రెండు వేల రూపాయలు ఇస్తున్నారు. అది కూడా ఐదారు నెలల ఆలస్యంగా. ప్రభుత్వానికి అవసరమైన సమాచారమంతా మేమే సేకరించాలి. అయినా వాళ్లు మమ్మల్ని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించడం లేదు. కనీస వేతనం కూడా ఇవ్వడం లేదు' అని గోరఖ్‌పూర్‌కు చెందిన చందా యాదవ్ అనే ఆశా కార్యకర్త తెలిపారు. గతంలో డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర రాజధానిలో ప్రదర్శన నిర్వహించామని, అప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వచ్చి డిమాండ్లన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. జీతాన్ని రూ.7,600కు పెంచుతామని, సహాయకులకు ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారని, కానీ అవన్నీ నీటిమూటలయ్యాయని వాపోయారు. ఉత్తరప్రదేశ్‌లో వచ్చే నెలలో పట్టణ సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికల దృష్ట్యా రాష్ట్రమంతటా 144వ సెక్షన్ విధించారు. ఏ విధమైన ప్రదర్శనలకూ అనుమతి ఇవ్వడం లేదు. ఎన్నికల అనంతరం రాష్ట్రవ్యాప్త నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని ఆశా కార్యకర్తలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.75 లక్షల మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారు.

పునరావాసంలో అమానుషం

- అసోం ప్రభుత్వంపై గౌహతి కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : అసోంలోని హోజై జిల్లాలో ఒక పునరావాస శిబిరంలో నెలకొన్న దయనీయ పరిస్థితులపై గౌహతి కోర్టు హేమంత్ బిశ్వశర్మ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శిబిరంలో తలదాచుకుంటున్న వారికి సరైన ఏర్పాట్లు చేయకపోవడం అత్యంత అమానుషమని వ్యాఖ్యానించింది. దొబోకా ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో నెలకొన్న పరిస్థితులపై దాఖలైన కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా విచారిస్తున్నారు. 2021 నవంబర్‌లో వందలాది కుటుంబాలను ఖాళీ చేయించి దొబోకా శిబిరంలో ఉంచారు. 'టార్పాలిన్ పట్టాలతో కట్టిన తాత్కాలిక శిబిరాలలో ప్రజలను పశువుల మాదిరిగా ఎలా ఉంచుతారు ?' అని ప్రభుత్వ న్యాయవాది నాథ్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్ట్ ఆదేశాల మేరకు ఆ శిబిరాన్ని సందర్శించిన సీనియర్ న్యాయవాది భాస్కర్ దేవ్ కొన్వర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. శిబిరంలో 18 నెలల వయసు నుండి ఆరేళ్ల వయసులోపు ఉన్న యాభై మంది పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారంటూ స్థానిక వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకొని హైకోర్ట్ ఈ కేసును విచారిస్తోంది. లుమ్‌డింగ్ అడవి సమీపంలో నివసిస్తున్న ప్రజలను రాష్ట్రప్రభుత్వం ఖాళీ చేయించి ఈ పునరావాస శిబిరంలో ఉంచింది. అందులో పశువుల కొట్టంలో కంటే పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆ పత్రిక కథనాన్ని ప్రచురించింది. మరుగుదొడ్లు, స్నానపుగదులు వంటి కనీస సౌకర్యాలు కూడా అక్కడ లేవని తెలిపింది. డ్రైనేజ్ వ్యవస్థ లేదని, విద్యుత్ సౌకర్యం కూడా లేదని ప్రస్తావించింది. ఈ శిబిరంలో 735 మంది పిల్లలు ఉంటున్నారు. 'మీ పిల్లలే ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉంటే...ఊహించుకోండి' అని ప్రభుత్వ న్యాయవాదిని జస్టిస్ మెహతా నిలదీశారు. చిన్నారులకు వైద్య సహాయం అందిస్తున్నామన్న ప్రభుత్వ వాదనను ప్రస్తావిస్తూ వారిని మళ్లీ అక్కడికే పంపుతారు కదా అని ప్రశ్నించింది.

అసోంలోని బీజేపీ ప్రభుత్వం 2021 మే నుంచి ఇప్పటివరకూ 4,449 కుటుంబాలను ఖాళీ చేయించింది. వీరిలో ఎక్కువ మంది బెంగాలీ ముస్లింలే. 'వీరి జాబితాను చూస్తే వారంతా ఒకే సామాజిక తరగతికి చెందిన వారని అర్థమవుతుంది' అని కోర్టు వ్యాఖ్యానించింది.

మీకోసం

కుక్కర్‌లో వండేటప్పుడు విజిల్ నుంచి నీళ్లు బయటికి రాకుండా ఉండాలంటే కుక్కర్ మూత అడుగుభాగంలో అంటే విజిల్ గొట్టం చివర రెండు చుక్కల నూనె వేయాలి.

జీవన సౌరభం

శ్రమ నీ ఆయుధమైతే.. విజయం నీ బానిస అవుతుంది.

ప్రపంచ పుస్తక దినోత్సవం

పిల్లలూ! విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి, ఎంతో మంది జీవితాలు వారి ఎదుర్కొన్న కష్టాలను అక్షర రూపంలో మనకు అందించి, ధైర్యాన్ని ఇస్తుంది పుస్తకం. అందుకే ఈ రోజు పుస్తక దినోత్సవం జరుపుకుంటున్నాం.

17వ శతాబ్దంనాటి యూరప్‌లో ఏప్రిల్ 23న సెయింట్ జార్జ్ డేగా పాటించేవారు. స్పెయిన్‌లో ఇదే రోజున ప్రతి పుస్తక కొనుగోలుపై ఒక గులాబీని బహుమతిగా ఇస్తారు. సెవాంతెస్, షేక్స్‌పియర్, ఇన్కా గర్సిలాసో వేగా వంటి ప్రఖ్యాత రచయితలు 1616 సంవత్సరంలో ఇదే రోజు మరణించారు. జోసెఫ్ ప్లా, వ్లాదిమర్, మారిస్ ద్రువాం వంటి చాలా మంది ప్రఖ్యాత రచయితలు ఇదే రోజు మరణించడమో, జన్మించడమో జరిగింది. అందుకే ఈ రోజును పుస్తక దినోత్సవంగా జరుపుతున్నారు. ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని 1955లో యునెస్కో ప్రకటించింది. ఈరోజును ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినంగా జరపాలని, రచయితలు, ప్రచురణకర్తలు, పాఠకులు, ఉపాధ్యాయులను ఈ రోజున గౌరవించాలని సూచించింది. అలాగే ఏటా ప్రపంచంలోని ఒక ప్రముఖ నగరాన్ని 'ప్రపంచ పుస్తక రాజధాని'గా ప్రకటిస్తూ వస్తోంది. 2023 సంవత్సరానికి గానూ ఆఫ్రికన్ దేశం ఘనాలోని నగరం ఆక్రాను ప్రపంచ పుస్తక నగరంగా ప్రకటించారు.

సరైన నీడ ఏది?



చిన్నారులూ, ఇక్కడ కోడి పుంజు ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

ఙ : ꣼ꣳꣴꣵ

నేను గీసిన బొమ్మ

కొల్లిపర జాహ్నవి,
5వ తరగతి,
సిద్ధార్థ పబ్లిక్ స్కూలు,
మొగల్రాజపురం,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పల్లె ముంగిట విజ్ఞాన ప్రపంచం

ఆ గ్రామానికి బడి, గుడి రెండూ ఉన్నాయి. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం మాత్రం లేదు. తమ గ్రామానికి లైబ్రరీని మంజూరు చేయాలని చాలా ఏళ్లుగా గ్రామస్తులు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. అధికారులనూ కలిసి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. ఆ గ్రామంలోనే పుట్టి, అక్కడే చదువుకుని అంచెలంచెలుగా ఎదిగి జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా ఉద్యోగ విరమణ పొందిన కొత్తకోట అప్పారావు మాస్టారు గ్రామంలో లైబ్రరీని నిర్మించడానికి ముందుకొచ్చారు. రామలక్ష్మి స్మారక గ్రంథాలయం ఏర్పాటు చేసి గ్రామస్తుల కలను సాకారం చేశారు. దాని ఫలితమే నేడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి విజ్ఞాన ప్రపంచం చేరువైంది.

ఫరీదుపేట జిల్లా కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ సుమారు ఐదు వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో అన్నీ ఉన్నా యువత చాలాకాలంగా కోరుకుంటున్న గ్రంథాలయం మాత్రం నెరవేరని కోరికగానే ఉంది. దీంతో వారు ఉద్యోగ, ఉపాధ్యాయ, ఇతర పోటీ పరీక్షల కోసం పది కిలోమీటర్ల దూరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చి చదువుతూ ఉండేవారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై రావడంతో కొంత వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు. చదువుకోవడంలో తాము పడుతున్న ఇబ్బందులను గ్రామంలోని పలువురు పెద్దలకు చెప్పుకున్నారు. వారు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. అయినా గ్రామస్తులు లైబ్రరీ ఏర్పాటు కోసం తమ ప్రయత్నాలను విరమించుకోలేదు. పట్టుదలతో వారు సాగించిన ప్రయత్నం ఫలించిన రోజు రానే వచ్చింది.

అందుబాటులో అనేక పుస్తకాలు

లైబ్రరీలో అవసరమైన కొన్ని ముఖ్యమైన పుస్తకాలను అప్పారావు మాస్టారు తన సొంత ఖర్చులతో కొనుగోలు చేశారు. మరికొన్నింటిని ఇతరుల నుంచి సేకరించారు. తెలుగు సాహిత్యం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, జీవశాస్త్రం తదితర అకాడమీ పుస్తకాలతో పాటు విజేత కాంపిటేషన్స్, విక్రమ్ సిరీస్, ఎపిపిఎస్‌సి, కళ్యాణి పబ్లికేషన్స్, డిఎస్‌సి మెటీరియల్ వంటి పోటీ పరీక్షల పుస్తకాలను ఏర్పాటు చేశారు. వాటిని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకుంటున్నారు. చిట్టిపొట్టి కథలు, తెనాలీ రామకృష్ణ, అక్బర్ బీర్బల్ వంటి కథలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటితోపాటు ఎచ్చెర్ల శాఖ గ్రంథాలయం నుంచి తీసుకొచ్చిన పుస్తకాలను అద్దె ప్రాతిపాదికన అందిస్తున్నారు. లైబ్రరీ నిర్వహణకు ఒక అసిస్టెంట్‌ను నియమించి, జీతాన్ని అప్పారావు మాస్టారే చెల్లిస్తున్నారు.

ఉద్యోగానికి ఎంపికయ్యా ...

కోవిడ్ రెండో దశ కాలంలో కోచింగ్ సెంటర్లు మూతపడడంతో నేను ఈ లైబ్రరీకే వచ్చి రెండు, మూడు గంటలు చదివి పోటీ పరీక్షలకు సాధన సాగించాను. ఇక్కడ ఉన్న అకాడమీ, పోటీ పరీక్షల పుస్తకాలు చూసి నోట్స్ రాసుకునేవాడిని. పోటీ పరీక్షలు రాస్తున్న క్రమంలో జిల్లా కోర్టులో ఉద్యోగానికి ఎంపికయ్యాను. గ్రామంలోని నిరుద్యోగ యువకులు గ్రంథాలయాన్ని సందర్శించడం ఇటీవల కాలంలో బాగా పెరిగింది.

- తమ్మినేని విజయకుమార్, ఫరీదుపేట

మంచి కథల పుస్తకాలున్నాయి

బడి విడిచిపెట్టిన తర్వాత రోజూ సాయంత్రం ఇక్కడికి వచ్చి పుస్తకాలు చదువుతాను. మంచి కథలు పుస్తకాలు ఉండడంతో ప్రతిరోజూ రావాలని పిస్తోంది. నా స్నేహితులతో వచ్చి తెనాలి రామకృష్ణ, అక్బర్ బీర్బల్ కథల పుస్తకాలు చదువుతుంటాను.

- కొత్తకోట వసంత, ఐదో తరగతి విద్యార్థిని, కేశవరావుపేట

ఆ రోజే ఆ ఆలోచన వచ్చింది

నేను డిగ్రీ చదువుతున్న రోజుల్లో శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయానికి వెళ్లేవాడిని. అక్కడ చిన్నపిల్లలు ఆసక్తిగా పుస్తకాలు చదవడం చూశాను. మా గ్రామంలోనూ ఇటువంటి లైబ్రరీ ఉంటే అందరికీ ఉపయోగపడే దనుకునేవాడిని. ఆ తర్వాత నేను రిటైర్ కావడం, ఆ సందర్భంలో గ్రామస్తులు సన్మానించడం, వారు కూడా లైబ్రరీ కోరడం యాదృచ్ఛికంగా జరిగాయి. సొంత ఊరుకి కొంత మేలు చేయాలనుకుని లైబ్రరీని కట్టించాను. అన్ని తరగతుల అవసరాలకు తగ్గట్టుగా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. ఈ–లైబ్రరీ కోసం ప్రయత్నిస్తున్నాం.

- కొత్తకోట అప్పారావు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ

గ్రామానికి చెందిన అప్పారావు మాస్టారు డిప్యూటీ డిఇఒ, డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంలో 2018 సెప్టెంబర్ ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో భార్యభర్తలిరువురికీ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఆ సభలోనే కొందరు గ్రామ పెద్దలు తమ మనసులోని మాటను బయటపెట్టారు. గ్రామంలో అన్నీ ఉన్నా పిల్లలు, యువతీ యువకులు చదువుకునేందుకు లైబ్రరీ లేదని, లైబ్రరీని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. వెంటనే స్పందించిన అప్పారావు మాస్టారు దంపతులు లైబ్రరీ నిర్మాణానికి అంగీకరించారు. ఆ కొద్దిరోజుల్లోనే లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో సైన్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అప్పారావు మాస్టారి సతీమణి రామలక్ష్మి మరణించడం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. కొద్ది నెలల తర్వాత అప్పారావు తన భార్య రామలక్ష్మి పేరిట స్మారక గ్రంథాలయం నిర్మాణానికి పూనుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పంచాయతీ స్థలానికి అనుమతులు తీసుకుని రూ.7.5 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. 2019, సెప్టెంబర్ 30న లైబ్రరీని ప్రారంభించి గ్రామస్తుల కలను నెరవేర్చారు. ఆబాలగోపాలానికి విజ్ఞాన వెలుగులు పంచుతున్న ఈ గ్రంథాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆశిద్దాం.

- టి.భీమారావు, ప్రజాశక్తి ప్రతినిధి, శ్రీకాకుళం

'మామా మశ్చీంద్రా' టీజర్

హీరో సుధీర్ బాబు నటిస్తున్న చిత్రం 'మామా మశ్చీంద్రా' టీజర్‌ను హీరో మహేష్ బాబు రిలీజ్ చేశాడు. టీజర్ విడుదలైన కొద్ది నిమిషాలకే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. మూడు విభిన్న గెటప్స్‌లో కనిపిస్తున్న సుధీర్ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ఇది లవ్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుంది. సుధీర్ బాబుకు జోడీగా ఈషా రెబ్బా, మృణాళిని రవి నటిస్తున్నారు. సమ్మర్‌లో విడుదలకు సిద్ధమైంది. శ్రీవెంకటేశ్వరా సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'సెల్ఫిష్' ఇవానా లుక్

నటుడు ఆశిష్ రెడ్డి నటిస్తున్న కొత్త చిత్రం 'సెల్ఫిష్'. విశాల్ కాశీ దర్శకుడిగా పరిచయమవుతూ ఈ సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు సినిమాపై కాస్త బజ్‌ను క్రియేట్ చేశారు. మేకర్స్ ఈ సినిమా హీరోయిన్‌ను పరిచయం చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఆశిష్‌కు జోడీగా ఇవానా నటిస్తుంది. ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. షూటింగ్ చివరిదశలో ఉన్న ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకులు ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మిక్కీ జె మేయర్ స్వరాలందిస్తున్నాడు.

'ఏజెంట్' సెన్సార్ పూర్తి

అఖిల్ చేస్తున్న సినిమా 'ఏజెంట్'. సురేందర్ రెడ్డి వంటి స్టైలిష్ డైరెక్టర్ ఈ సినిమాకు తెరకెక్కించడంతో సినీ ప్రేమికుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అఖిల్ సిక్స్‌పాక్‌తో ఫుల్ యాక్షన్ మూడ్‌లో నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 28న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస ప్రమోషన్‌లతో బిజీగా గడుపుతుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. రన్‌టైమ్ 2 గంటల 36 నిమిషాలుగా ఉంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలకపాత్ర పోషించాడు. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించింది. ఏకే ఎంటర్‌టైనమెంట్స్‌తో కలిసి సురేందర్ రెడ్డి స్వీయ నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కించాడు.

'రామబాణం' మరో పాట రేపు

'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత మాచో స్టార్ గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు, రెండు పాటలకు మంచి స్పందన వచ్చింది. 24న రామబాణం థర్డ్ సింగిల్ నువ్వే నువ్వే పాటని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రం మే 5న విడుదల కానుంది.

లక్నో తడబడింది.. గుజరాత్ గెలిచింది



లక్నో : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్–16లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తడబడింది.. గుజరాత్ టైటాన్స్ గెలిచింది. లక్నో సూపర్ జెయింట్స్ ముందుంచిన స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో చివరి ఓవర్లలో చాకచక్యంగా ఆడి గుజరాత్ టైటాన్స్ విజయాన్ని సొంతం చేసుకుంది. 136 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తడబడిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 128 పరుగులు మాత్రమే చేసింది. లక్నో బ్యాటర్లలో కెఎల్ రాహుల్ (68 పరుగులు, 61 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించినా ఫలితం లేకుండాపోయింది. కైల్ మేయర్స్ (24), కృనాల్ పాండ్య (23) మెరుపులు వృథా అయ్యాయి. నికోలస్ పూరన్ (1) విఫలమయ్యాడు. గుజరాత్ బౌలర్లలో నూర్ అహ్మద్, మోహిత్ శర్మ చెరో రెండు, రషీద్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. వృద్ధిమాన్ సాహా (47 పరుగులు, 37 బంతుల్లో 6 ఫోర్లు), హార్దిక్ పాండ్య (66 పరుగులు, 50 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. మిగతా ఆటగాళ్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. శుభ్‌మన్ గిల్ (0), అభినవ్ మనోహర్ (3), విజయ్ శంకర్ (10), మిల్లర్ (6) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్య, స్టొయినిస్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. అమిత్ మిశ్రా, నవీన్ ఉల్ హక్ ఒక్కో వికెట్ తీశారు.

సురేఖ, ప్రవీణ్ జోడీకి స్వర్ణం

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ఖాతాలో మరో పసిడి పతకం చేరింది. ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్ 1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ–మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె జోడీ భారత్‌కు స్వర్ణం అందించారు. తుర్కియేలోని అంటాల్యా వేదికగా శనివారం జరిగిన ఫైనల్లో భారత జోడీ–చైనీస్ తైపీ ద్వయంతో తలపడింది. ఈ క్రమంలో 159–154తో ప్రత్యర్థిపై గెలుపొంది సురేఖ–ప్రవీణ్ భారత్ ఖాతాలో గోల్డ్ మెడల్ చేర్చారు. జ్యోతి సురేఖకు మెగా ఈవెంట్‌లో ఇది రెండో స్వర్ణ పతకం. పారిస్‌లో 2022లో జరిగిన వరల్డ్‌కప్–3లో జ్యోతి సురేఖ– అభిషేక్ వర్మతో కలిసి విజేతగా నిలిచారు. తాజాగా ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్ 1 టోర్నీ ఫైనల్లో ప్రవీణ్‌తో కలిసి చెన్ యి సువాన్ చెన్ చియె లున్ జోడీని ఓడించి తన ఖాతాలో మరో పసిడి పతకం జమచేసుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68